

# బాల వికాసం

## దుష్టుడి కానుక (కథ)

ఒక రోజు రవి బడికి ఆలస్యంగా వెళ్ళాడు. అప్పటికి గురువు పాఠం చెప్పి ఇంటిపని చెయ్యమని ఆదేశించి వెళ్ళిపోయాడు.

పిల్లలు తరగతి గదిలో ఆడుకునేవాళ్ళు ఆడుకొంటున్నారు, రాసుకునేవాళ్ళు రాసుకుంటున్నారు, ఏమీ పట్టనివాళ్ళు అల్లరి చేస్తున్నారు. ఇంతలో తరగతి గది వాకిట్లో నిలబడి లోపలకి తొంగి చూసి, ఎవ్వరు గురువులు లేనందు వలన బ్రతుకు జీవుడా! అని గుండెలమీద చెయ్యి వేసుకుని గట్టిగా ఊపిరి పీల్చుకొని వదిలాడు రవి.

అది గమనించిన శ్యామ్ "ఎరా! ఎందుకు ఆలస్యం?" ఈ స్నేహితుడు గుర్తుకు రాలేదా? నా కంటే మంచి స్నేహితులు ఇంకెవరైనా ఉన్నారా?" అని ఎగతాళిగా ప్రశ్నించాడు.

"అవునురా! చాలా మంచి స్నేహితుడు మా ఇంటి దగ్గర ఉన్నాడు" అన్నాడు రవి.

"ఎవ్వడు వాడు? చెప్పు! అని గట్టిగా అడిగాడు శ్యామ్.

"మా ఇంటిదగ్గర ఉన్న జామచెట్టు!" అన్నాడు రవి.

"వీడికి మంచి స్నేహితుడు జామచెట్టంటా! అరే! భరత్, కేతన్, చూడండిరా!" అంటూ అల్లరి చేసాడు శ్యామ్.

ఆ విషయం రవికి చాలా బాధ అన్పించింది. ఆ చెట్టు గురించి చెప్పాలనిపించింది.

"నా చిన్నప్పుడు మా అమ్మానాన్నలు నా పుట్టిన రోజు కానుకగా ఈ జామచెట్టు ఇచ్చారు. దానిని మా ఇంటి ముందు నాటి, ఉదయం నీళ్ళు పోసి ఎరువులేసి, ఏమైనా చీడపురుగులు పడితే మందులు కొడతాను. చెట్టునీడన కూర్చొని చదువుకుంటాను. నాన్న తెచ్చిన బొమ్మలతో చెట్టూ, నేను ఆడుకుంటాము".



"నేను ఎలా పెరిగానో అది కూడా అలాగే పెరిగింది. ఎన్నో కొమ్మలు, ఎన్నో చిగురుటాకులు ఎంత అందంగా ఉందో?" అమ్మానాన్నలు పొలానికి పోయినపుడు నాకు ఆకలి అయితే జామ పండ్లు ఇస్తాది. ఆడుకొని అలసిపోయి పడుకొంటే చల్లగా గాలి విసురుతుంది. కొమ్మలెక్కి ఆడుకుంటే సంతోషపడుతుంది. అంత మంచి స్నేహితుడు" అన్నాడు రవి.

"నేను కూడా అడిగితే కానుకలు ఇస్తుందో లేదో మీ స్నేహితుడిని అడిగిరా!" అన్నాడు శ్యామ్.

"మిత్రమా! నా స్నేహితుడు నిన్ను పలకరించటానికి శ్యామ్ వస్తాడంటా! వాడికి నువ్వు కానుకలు ఇవ్వు" అని కొమ్మ పట్టి చెప్పాడు రవి. రవితో సరే!" అంది జామచెట్టు..

జామ చెట్టు "శ్యాం ఎప్పుడు వస్తాడా!" అని ఎదురు చూస్తోంది.

రవి లేని సమయం చూసి శ్యామ్ రవికి స్నేహితుడైన జామచెట్టు దగ్గరకు పోయాడు.

"రా! మిత్రమా! నీ గురించి రవి చాలా చెప్పాడు. రవికి నీవు స్నేహితుడివైతే నాకు కూడా నీవు మంచి స్నేహితుడివే , కాబట్టి రోజూ నా దగ్గరికి వచ్చి ఆడుకో! నా పండ్లు ఎన్ని కావాలంటే అన్ని తిను." అంది జామ చెట్టు.

చెట్టును ఎగా దిగా చూశాడు శ్యాం. చెట్టు గురించి చెడ్డ ఆలోచనలు చేయడం మొదలుపెట్టాడు. "నీకోసం నేను ఏమి తెచ్చానో తెలుసా? అన్నాడు శ్యామ్.

"తెలుసు! నీరో, ఎరువో తెచ్చి ఉంటావు" అంది జామచెట్టు.

" అదికాదు! అంటూ తన వెనుక దాచిన గొడ్డలిని తీసాడు శ్యామ్.

గొడ్డలిని చూడగానే భయం తో, వణికి పోయింది జామచెట్టు.

"ఎందుకు తెచ్చావు" అంది. "నిన్ను నరకడానికి" అని గొడ్డలితో నరక బోయాడు.

"ఆగు శ్యామ్! ఈ చెట్టును నరకడానికి నీకు ఏమి హక్కుంది." అని ప్రశ్నించాడు ఒక వ్యక్తి.

"ఎవరు నువ్వు?" అన్నాడు శ్యామ్.

"నా పేరు వాల్మీకి అంటారు"

"ఎందుకు వచ్చావు?

"చూడు నయానా! నీవు ఎవరో తెలియదు తన స్నేహితుడి స్నేహితుడు వచ్చినందుకు బుట్ట నిండా జామపండ్లు సిద్దంగా ఉంచింది. నీ రాక కోసం ఎదురు చూసింది. ఇప్పుడే కాదు. నీ జీవితమంతా, నీ పిల్లలు వచ్చి పండ్లు తిని పోయినా, నిన్ను ఏమనదు. తాను చనిపోయేంతవరకు నీకు సహాయం చేస్తుంది. అలాంటిది నీ నుంచి ఏమీ కోరని దాన్ని, గొడ్డలితో నరకాలంటే... నరుకు.. కానీ ఒక్క క్షణం ఆలోచించు , నీ స్నేహితుడు మరియు వాళ్ళ కుటుంబం, ఆకలితో ఇక్కడికి వచ్చి జామపండ్లు తినే పక్షులు ఎంత బాధ పడతాయో!".. అన్నాడు వాల్మికి.

చెట్టు క్రింద తలవంచుకొని కూర్చొని ఆలోచిస్తున్న శ్యామ్ కు కళ్ళల్లో కన్నీళ్లు రావడం మొదలైయ్యాయి. తప్పు తెలిసింది. తల ఎత్తి చూశాడు.

చెట్టు కొమ్మలు తన ఆకులతో చల్లని గాలిని వీయటం చూశాడు. కానీ వాల్మీకి అక్కడ నిలబడలేదు. తన దారిన మరొక ఊరికి పయనమయ్యాడు.

గొడ్డలిని చెట్టుకింద పడేసి తన తప్పును క్షమించమని వేడుకున్నాడు. "రవికి నాకంటే గొప్ప స్నేహితుడు మరోక్కరు ఉండకూడదని అనుకున్నాను. ఇది ఎంత పెద్ద తప్పో తెలిసింది." అని ఏడుస్తూ అన్నాడు శ్యామ్ చెట్టుతో.

"మిత్రమా! ఏడ్చవద్దు. నాకు రవి ఎలాంటి వాడో నీవూ అంతే గొప్ప స్నేహితుడివి. రవి లా వచ్చి నాతో ఆడుకో! అని శ్యామ్ ని హృదయానికి హత్తుకొంది జామచెట్టు.



-పుల్లా రామాంజనేయులు
9491851349

## వారెవా..!

పిచ్చిపువ్వుల్ని
నెత్తికెక్కించుకొని
నెత్తీ నోరూ కొట్టుకునే
జనం..
ఇంకెవ్వరు..?
మనం..!

పోయాక..
మోసేందుకు మాత్రమే కాదు
మన గురించి రాసేందుకు కూడా
నలుగురు కావాలి..
ఏమైనా ఇస్తే ఎవరైనా రాస్తారు
ఏమైనా చేస్తేనే
ఆ నలుగురు రాస్తారు..!

నమ్మకు
మోసపోతావ్
అన్నాడు మురళీ..
ఏదో ఒకటి పోతున్నప్పుడు
బాధపడుడెందుకు..?
నవ్వుకున్నాన్నేను..!



- సంగెవేని రవీంద్ర
సెల్ : 99871 45310

## బాల గేయం

## ఆకు కూరలు!

ఆకుకూరలే అందరికీ
ఆరోగ్యం అందించేను!
కంటికి–ఒంటికి పుష్టిని కూర్చి
ఇంటింటిని అలరించేను!

పెరటిలో పెరిగిన తోటకూర
పెంపుజేసిన పాలకూర
చుక్కకూర–బచ్చలికూర
చక్కనైన పొనగంటి కూర
నోరూరించే గోంగూర

'ఐరన్ విటమినులందించేను
చేపలు–గుడ్లను మించేను!
శక్తినే ప్రసాదించేను!
అందుకె వాటిని ప్రతిరోజూ
ఆరగించి, ఆరోగ్యంగా
భువిలో బుద్ధిగ జీవించాలి!
అన్నింటను రాణించాలి!
శాకాహారం మేలుమేలని
శంఖారావం గావించాలి!
కొత్తిమీర–కరివేపాకు
కొసరి కొసరి వినియోగించి
పుదీనా, మెంతియాకును
పుష్కలంగ సేవించాలి.



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## ఉపాధ్యాయులు

ప్రేమను తెలియజేసేది
అమ్మ
జీవితం తెలియజేసేది
నాన్న
లోకంలోని
లోకులతో ఎలా
మెలగాలో మెరుగులు దిద్దేది
గురువు!!!

విద్య ఒకటే కాదు
మనలోని ఆట,పాటలను
నైపుణ్యాలుగా గుర్తించి
చదువుతో పాటుగా
చక్కగా మన కళలను
వైభవంగా దిద్దేవాడే గురువు!

విద్య ఒకటే కాదు
సంస్కారం నేర్పిస్తూ
సంఘం గూర్చి
బుద్దుడిలా బోధిస్తూ
శాంతి, హింసలను
ఎలా వాడాలో
నేర్పేవాడే గురువు!

తల్లితండ్రి ఆలన
గురువు పాలన
మనకెంతో నేర్పిస్తుంది
ముందుకు నడిపిస్తుంది
చైతన్య వంతులుగా
చక్కటి నడవడికతో
ఎంతో ఎత్తుకు ఎదగగలిగేలా
చేసేది ఒక్క గురువే!!!

గురవనే వాడు
మాటతో బెదిరించిన
బెత్తంతో బాధిన
మన మేధ శక్తికై
అహోర్నిషలు పరితపించేవాడు
మనకంటూ కీర్తిని
కావించే దాక మనల్ని
వెంటాడేవాడు ఒక్క గురువే!!

చదువుతో పాటుగా
చదువుకు సంబంధం లేని
విషయాలను సైతం
తెలియజేస్తూ తెలివిగా
మలుచుతు మదిలో
మంచితనాన్ని మెరిపిస్తూ
మనసుతో ఆలోచించేలా
చేసెదొక్క గురువే!

పెద్దవారిపై దొడ్డ మనసుతో
గౌరవంగా గారభంగా
ప్రేమను తెలియజేసేలా
మనలో సుభాషితంగా
ముత్యంలా మాణిక్యంలా
మెరుగు దిద్దేది గురువే!

మన బాటకు మెట్లను
బోధనలా అధ్యాయపిస్తూ
మనకంటూ మనమే
స్థాయికి చేరుకునేలా
ముందుకు నడిపేది
నడిపించేది ఒక్క గురువే!



-మల్లె. రంజిత్ కుమార్
7032650908

## "అమ్మ నే బడికి పోత"

అమ్మ నేను బడికి పోతనే
నాబడి నన్ను
పిలుస్తున్నట్టనిపిస్తుందమ్మా
చేతులు చాచి నన్ను రమ్మంటుందే
నన్ను బడి అనే గుడికి పంపియ్యమ్మా
బడి మూగ రోదన నాకు వినిపిస్తోందే
నా రాకకై క్లాస్ రూమ్ ఎదురుచూస్తుందమ్మా
రోజు నీళ్లు పోసి పెంచిన
రోజా పూలు రంగురంగుల
బంతి చామంతులూ
ఉయ్యాలలూగే చింత చెట్టు
నన్ను పిలుస్తున్నట్లు అనిపిస్తుంది
తన ఒడిలో ఆడుకునే బడి ప్రాంగణం
నేను వస్తానని ఎదురు చూస్తుందమ్మా.
అమ్మ బడికి ఏమైందమ్మా
ఒక్కసారి బడిని పలకరిస్తనే
నా నేస్తాలను నే వదిలి ఉండలేను
అమ్మ నేను బడికి పోత
నా బడిని చూసి మళ్లోత్త



-యాదవరనీ రేవంత్ గౌడ్
9441762105

## కరోనా కష్టాలు

కరోనా పుణ్యమా అందరిలో కలవరం
ఈ ఏడాది పండుగలన్నీ కళ తప్పి దోడువడే
బడి ఈడు పిల్లలకు ఇల్లే బందీఖానాయే
పెద్దవారికి ఘడియ గండ మాయే
ఇంటిల్లిపాది అంతా ఇంటికే పరిమితమాయే
సేవలు చేయక ఇల్లాలికి ఇబ్బంది వచ్చే
నా ఇల్లే నా స్వర్గ సీమయ్యే
అడుగు బయట పెట్టక పిల్లల అల్లరి ఎక్కువాయె
సెల్ ఫోను టీవీలకు అతుక్కుపోయిరి అందరూ
ఏసీ ఫ్యాన్ ల మోతతో పవర్ బిల్లు మోగిపోయే
ఆన్లైన్ పాఠాలతో ఆరోగ్యం అంతరించే
తిండి ఎక్కువయ్యి తిండి
పోతులైరి
బారెడు పొద్దెక్కె దాకా లేవక పోయిరి
ఎవరి ఇళ్లల్లో వారిమే ఉందాం
సామాజిక దూరం పాటిద్దాం
కలిసికట్టుగా కరోనాను తరిమేద్దాం

- ఒగ్గు సునీత
8 వతరగతి,జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల
,లక్ష్మీదేవిపల్లి మం॥ :నారాయణరావు పేట
జిల్లా :సిద్దిపేట
9441762105

## చదువులమ్మ

బాతమ్మనడిగి
బంతిపూలు తెచ్చా
కొంగమ్మనడిగి
కనకాంబరం తెచ్చా
చిలకమ్మనడిగి
చామంతులు తెచ్చా
కోయిలమ్మనడిగి
కాకడాలు తెచ్చా
ఉడతమ్మనడిగి
మల్లెపూలు తెచ్చా
కోడెమ్మనడిగి
సంపంగులు తెచ్చా
హంసమ్మనడిగి
మందారాలు తెచ్చా
పిచ్చుకమ్మనడిగి
సన్నజాజులు తెచ్చా
పూలన్ని మాలచేసి
చదువులమ్మకిచ్చా

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## అంచనాలు.. (కథ)

"హలో సురేష్.."

"ఆc.. ఆంటీ.."

"ఏమనుకోకయ్యా..చాలా మంది వున్నారని మాట్లాడలేక పోయాను"

"ఏం పర్లేదు ఆంటీ..అర్థం చేసుకోగలను.."

"మొన్న ఒక సంబంధం వచ్చిందని చెప్పా కదా.."

"ఏది ఆంటీ.."

"అదేనయ్యా..వైజాగ్ ది.."

"ఆc..ఆc.."

"అమ్మాయి ఫొటోలో బాగా డామినేటింగ్ గా కనపడుతుంది.వయసు కూడా ఎక్కువగానే వున్నట్టుంది.."

"వెళ్లి చూసొస్తానన్నట్టున్నారుగా ఆంటీ.."

"ఆc..ఏం వెళ్లడం..నేనే ఎగరగొట్టాను.."

"అదేంది..ఎందుకాంటీ..?"

"ఆc..ఆ పిల్లచూస్తుంటే అంత అణకువగా అనిపించలేదు..రేపు వచ్చి మన మీదే పెత్తనం చేస్తే..?"

"ఒట్టి ఫొటో చూసి అలా అనుకోవచ్చా ఆంటీ..?"

"ఆ..మొఖం చూసి కొన్ని చెప్పేయొచ్చు..నీకేం తెలుసు.."

"..............."

"మా వారొక సంబంధం తెచ్చారు. తెలిసిన వాళ్లంట. అమ్మాయి బీటెక్ చదివిందంట.పిల్ల మంచిదేనంట.. కాకపోతే ఎక్కువ ఇచ్చుకోలేమని ముందే చెప్పేశారంట.."

"డబ్బుంది ఏముందాంటీ..అమ్మాయి మంచిదయితే చాలు కదా.."

"అవుననుకో..గానీ..ఆ పిల్లకి ఇప్పుడే చదువయిందంట..ఉద్యోగం లేదు.ఇప్పుడీ అమ్మాయి అమెరికా వెళ్లి, చదివి,ఉద్యోగం తెచ్చుకోవాలంటే ఎంత టైం పట్టుద్ది చెప్పు .. ఎంత ఖర్చవుద్ది..మాటలా చెప్పు.. పైగా ఈ కరోనాలో వర్క్ ఫ్రం హోమ్ అంట..అబ్బాయికి శాలరీ కట్ అవుతుందంట.. ఇంక వాడు ఈఎంఐలకి ఏం కడతాడు..?ఇంట్లో ఖర్చులు.. పై ఖర్చులు..ఇద్దరి శాలరీలు వుంటేనే అక్కడ అంతంత మాత్రంగా వుంటుంది. ఏవంటావు సురేషు..?"

"..............."

"పైగా పండగపబ్బాలకి శుభకార్యాలకు అమెరికా నుండి రాకపోకలకు ఎంత ఖర్చు...? అబ్బాయి ఒక్కడే ఇవన్నీ భరాయించడం కష్టం కదా..!వేన్నీళ్లకి చన్నీళ్లు.. అమ్మాయిది కూడా కలిస్తే బావుంటుంది..నువ్వే ఆలోచించు..నేను చెప్పేది కరెక్టో కాదో.."

"అబ్బో..ఆంటీ..చాలా దూరం ఆలోచిస్తున్నారే.. గ్రేట్"

"ఆలోచించకపోతే ఎలా..?పెద్దాళ్లం అన్నీ ఆలోచించాలి.."

"ఆ తలనొప్పులు మీకెందుకాంటీ..వాళ్లే చూసుకుంటారు కదా"

"వాళ్ల బొంద..ఏంది చూసుకునేది? వాళ్లకేం తెలుసని?మనమే చూడాలి. ఈ పిల్లకి పాస్ పోర్ట్ వుందో లేదో..?మళ్లీ ఊ1ః అప్లై చేయాలి. అదెప్పుడొస్తుందో..ఏం పాడో.."

"ట్రంపు వచ్చిన తర్వాత వీసాలు కష్టం అయ్యాయి ఆంటీ.."

"అవును..మరే..డబ్బులూ లేక..చదువు ఉద్యోగం లేక ఆ పిల్లని ఏం చేసుకుంటాం..? ఉన్న డబ్బులు ఖర్చు పెట్టుకుంటూ కూర్చుంటే రేపు అక్కడ ఇళ్లు కొనాలంటే ఎలా కొంటాం?"

"................."

"మ్యాట్రిమోని వాళ్లకి చెప్పకపోయారా..ఆంటీ.."

"అదీ అయింది సురేషు..కట్నాలు బాగుంటే పిల్ల బాగుండడంలా..పిల్ల బాగుంటే ఉద్యోగం వుండడంలా..అన్ని బాగుంటే వాళ్లు మనకి దొరకడంలా.."

"మనకి తగ్గావాళ్లని మనం చూసుకోవాలి..అన్నీ వున్న వాళ్లు అంత తొందరగా దొరకరు ఆంటీ.."

"ఈ మ్యాట్రిమోనిల్లో అన్నీ నాసిరకమేనయ్యా.. అన్ని చోట్ల తిరిగి తిరిగి ఎక్కడా సెట్ కానోళ్లే ఇక్కడ మిగులుతారంట."

"............."

"ఇక్కడ ఊళ్లల్లో సంబంధాలు నాలుగైదు కోట్లు ఇస్తామని వస్తున్నారు గానీ..మనక్కావాల్సినవి రావడం లేదు.."

"ఇంతకీ మీ అబ్బాయి ఉద్దేశం ఏంది ఆంటీ..?"

"వాడిది ఏముంది సురేషు..మనం ఏదంటే అదే.."

"అక్కడ మనోళ్ల సంబంధాలు ఏవన్నా వున్నాయేమో చూడమని చెప్పకపోయావా.. ఆంటీ.."

"ఆc..వాడూ ఒకటి చూసాడు..అన్నీ బాగానే వున్నాయి గానీ..."

"మరి ఇంకేంది ఆంటీ..?"

"ఆ అమ్మాయికి వాడి కన్నా యాభైవేలో ఎంతో జీతం ఎక్కువంట..జీతం ఎక్కువని వాడినేవన్నా చిన్నచూపు చూస్తుందేమోనని ఆలోచిస్తున్నాను.."

"ఎక్కువయితే మంచిదేగా ఆంటీ.."

"ఆc...ఆడవాళ్ల సంగతి నీకేం తెలుసు..? కొంచెం అలుసు ఇస్తే కొంగున కట్టుకొని ఆడించేస్తారు.."

"..................."

"అసలే అమెరికా.. అందరితో ఫ్రీగా వుంటారు.. అంత అందం..జీతం వున్న ఆడపిల్ల ప్రేమని.. దోమని తిరగకుండా వుంటుందా అని.."

"..................."

"అది కాదు సురేష్..నీ రిలేటివ్స్ లో మంచి సంబంధం వుందంట కదా..అమ్మాయి బావుంటుందంట..మంచి ఉద్యోగం అట.. మంచి జీతమంట.."

"అవును ఆంటీ..వాళ్లు చాన్నాళ్ల క్రితమే అమెరికాలో సెటిల్ అయారు. గ్రీన్ కార్డ్ హోల్డర్స్. అందరికీ సిటిజన్ షిప్ వచ్చేసింది.బాగానే సంపాదించారు.."

"మరి ఆ సంబంధం చూడకపోయావా.."

"నేను మీరిచ్చిన అబ్బాయి డిటెయిల్స్ అన్నీ వాళ్లకి పంపానాంటీ.."

"హ..హ..ఏవన్నారు..?"

"చిన్న వయసులో అంత పొట్ట ఏంది అన్నారు.."

"ఆc....ఏంది..?"

"అంత పొట్ట ఏంది అన్నారు"

"పొ..పొ..పొట్ట..పొట్ట తగ్గడానికి జిమ్ కి వెళుతున్నాడయ్యా.."

"బాల్డ్ బాగా ఎక్కువుగా వుందన్నారు.."

"అదా..అమెరికా వెళ్లిన తర్వాతే ఎక్కువయిందయ్యా.. ట్రాన్స్ ప్లాంటేషన్ చేయిద్దామనుకున్నామయ్యా.."

"లేట్ నైట్ పార్టీలు.. పబ్ లు ఎక్కువంట గదా.."

"ఏం లేదయ్యా..ఇంటి దగ్గరే వుంటున్నాడు.."

"ఇప్పుడంటే కరోనాకి భయపడి ఇంటి దగ్గర వుంటున్నాడు ఆంటీ..అంతకు ముందు...?ఫొటోలు కూడా వున్నాయి.. పంపమంటారా.."

".................."

"డ్రగ్స్ అలవాటయితే అంతే సంగతులు ఆంటీ..."

".................."

"కార్డు కూడా అంత బాగా లేదంట.."

".................."

"ఆంటీ...హలో..హలో ఆంటీ.."

"....ఆc....ఆc....వా....నంరేషం..ఎవరో వచ్చినట్టున్నారు..మళ్లీ ...మళ్లీ చేస్తానయ్యా..."



- పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

## ఉడత చెలిమి

ఉడతా..ఉడతా రావమ్మా
మాతో స్నేహం చేయమ్మా
ఊసులు ఎన్నో చెప్పమ్మా
గింజలు నీకు ఇస్తాము
దండిగా పండ్లు పెడతాము
చెట్లు, చేమలు తిరుగుతూ
ఊడలు ,తీగలు ఊగుతూ
కొమ్మలు ,రెమ్మలు గెంతుతూ
వాగులు ,వంకలు దాటుతూ
మాతోనే నీవు తిరుగుతూ
కల కాలం కలిసుందాము



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277249

## రాత – గీత

### గుడుంబ

కుటీర పరిశ్రమలు లేవని
కుంటి సాకులు చెప్పే
కుటిల రాజకీయాలు మనవి
పల్లె పల్లెల్లోన
పట్నాల గల్లీల్లోన
పటిక బెల్లాలతో
కుటీర పరిశ్రమలు వెలిశాయి.



### అమరం

జీవితం
గాలిబుడగే
జ్వలించనీ..
ఆ క్షణకాలం
రగులుతుంది
కలకాలం..





రాత–శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత–వర్చస్వి

## మంచి మాటలు వినాలి (కథ)

రామవరం అనే ఊరిలో లో రాకేష్ సురేష్ అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారు ఒకరంటే ఒకరికి ప్రాణం .రాకేష్ సురేష్ ఇద్దరు పోటీ పడి చదువుతారు. ఉపాధ్యాయులు ఏ పరీక్ష పెట్టినా వీరు ఇద్దరికే మొదటి స్థానం వచ్చేది.

కొన్ని రోజుల తర్వాత రాకేష్ కి పరీక్షలలో తక్కువ మార్కులు వస్తున్నాయి. ఒక రోజు సురేష్ , రాకేష్ దగ్గరికి వచ్చి

"నువ్వు మొదట చాలా బాగా చదివే వాడివి కదా మరి ఇప్పుడు చదువులో ఎందుకు వెనుకబడుతున్నావు ,చదువులో నీకన్నా వెనుకబడిన వారు ఇప్పుడు నీ కంటే చాలా ముందు ఉన్నారు .అసలు నీకు ఏమైంది ? "అని కోపగించుకున్నాడు .అప్పుడు రాకేష్ చాలా బాధగా వెళ్లి అసలు నేను ఎందుకు చదవడం లేదు నేను చదువుకోవాలని మా అమ్మ నాన్న చాలా కష్టపడుతున్నారు కానీ నేను చదవడం లేదు అని తనకు తాను ప్రశ్నించుకున్నాడు.

మరుసటి రోజు నుంచి రాకేష్ ఎలాగైనా చదువులో ముందు ఉండాలనుకున్నాడు .అప్పుడే పదవ తరగతి వార్షిక పరీక్షలు వచ్చాయి రాకేష్ సురేష్ బాగా చదివి పరీక్షలు రాశారు పరీక్షలు పూర్తి అయి రెండు నెలల తర్వాత ఫలితాలకోసం ఎదురు చూసే సమయం రానే వచ్చింది . రాకేష్ ,సురేష్ల కు 10 జీపీఏ వచ్చింది .అప్పుడు వారిద్దరూ చాలా సంతోషంగా గా పైచదువులు చదివి, ఉన్నత ఉద్యోగము చేస్తూ జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నారు.

ఒకరోజు సురేష్ కు అనుకోకుండా రాకేష్ కలిశాడు .అప్పుడు రాకేష్ ఇలా అన్నాడు "సురేష్ ,నీవు ఆ రోజు నన్ను అలా కోపగించుకోకుంటే నేను ఈరోజు ఉన్నత స్థాయిలో ఉండేవాడిని కాదు .నిన్ను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోను .నా మేలు కోరి నన్ను మార్చావు ."

నీతి : మంచిని బోధించిన మాటలు కఠినతరమైన స్వీకరించాలి.



-గూడెపు సౌమ్య
10వ,తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
జక్కాపూర్
సిద్దిపేట జిల్లా
సెల్ : 8297399540





కిన్నెర, ద్వానా కుటీరం, నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు కీ॥శే॥ డా॥ ద్వా.నా.శాస్త్రి సంస్మరణ సభ సందర్భంగా



"నాన్న"
అంశంపై కవితల పోటీ

ప్రథమ బహుమతి రూ.5,000/- నగదు, ప్రశంసా పత్రము, • ద్వితీయ బహుమతి రూ.3,000/- నగదు ప్రశంసా పత్రం
తృతీయ బహుమతి రూ.1,000/- నగదు ప్రశంసా పత్రము, • ప్రోత్సాహక బహుమతులు 5: ఒక్కొక్కరికి రూ.500/-లు

రెండక్షరాల పదం, రెండు సెకండ్ల పిలుపు వర్ణించలేనంత ప్రేమ జన్మంతా సరిపడా నమ్మకం "నాన్న"
కుటుంబానికి మకుటం లేని మహారాజుగా నిలబడి జీవితాన్నంతా ధారపోసి ఏమీ ఆశించని రూపం "నాన్న"
ఇంతకంటే ఏం చెప్పగలం? ఇంతకంటే ఏం రాయగలం? అనుకుంటున్నారా... ఎంతో రాయవచ్చు.. త్యాగమనే పదంలో ఇరుక్కుని ఎవరికీ కనబడని పాత్ర "నాన్న"
ఇరవైఐదు వాక్యాలకు మించకుండా "నాన్న" పై మీకున్న అనురాగానికి అక్షర పట్టాభిషేకం చేయండి.

కవితలను 12-02-2021 లోగా పంపించండి..
(ఈ పోటీకి 50 సం॥లలోపు వారు మాత్రమే అర్హులు)

కవితలు పంపవలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్ నగర్, హైదరాబాద్-20

## అన్నదాత

అతనిదొక సామాన్య జీవితం
కానీ ప్రపంచానికి తిండి పెట్టగలడు
తానొక మురికిమనిషి
కానీ సుగంధ ద్రవ్యాలను ఉత్పత్తి చేయగలడు
కరీదైన దుస్తులు ధరించడతను
వాటి ముడిసరుకు పండిస్తాడు.

పంచబక్ష పరమన్నాలు రుచించ వతనికి
పచ్చడిమెతుకులే తన ఆకలి
కటికోడు కాదతను జంతు ప్రేమికుడతను
పట్టు పరుపుల మీద పవలించడతను
పచ్చని వొడ్లపై సేదా తీరుతాడతను
బంగళాలు,భవంతులు కావాలను కోడు
పూరిగుడిసే తన అందాల మేడ
లగ్జరీ కార్లు నడపడతను ఎడ్లబండే తన వాహనం
ఒంటరి వ్యక్తి కాదతను ప్రపంచానికి మార్గదర్శకుడతను.

స్వార్థ పూరిత జీవితం కాదాయనది
కాలే కాడుపులకు జీవం పోసే జీవితమతనిది
పాలకుల నయ వంచనకు,
కంపెనీల నకిలీ విత్తనాలతో,
నకిలీ పురుగుమందులతో,
దళారుల దోపిడీకి బలైపోతున్న శ్రమజీవతను

ఆత్మగౌరవం లేని వ్యక్తి కాదతను పరువు కోసం
ప్రాణం తీసుకొనే వ్యక్తతను
భూ తల్లిని ముద్దాడుతూ
భూ తల్లి ఒడిలోనే నిద్రపోయే బిడ్డతను
మోసగాడు కాదతను కలిసి రాని కాలానికి బాద్యుడతను...

సూర్యోదయం తరువాత మొదలై
సూర్యాస్తమయం లోపు ముగించే ఉద్యోగం కాదతనిది
తొలి వేకువ జామున మొదలై తొలిరేయి వరకుంటుంది
కాలం కాటేసిన, ప్రకృతి కన్నెర్ర చేసిన ధైర్యంగా
నిలబడే గుండె నిబ్బరం అతనిది
బలహీనుడు కాదతను బీడు భూములను పచ్చని పంట
పొలాలు గా మార్చే కర్షకుడతను

ఆత్మబంధువతను
అలుపెరుగని పోరాట జీవతను
విశ్రాంతి లేని ఉద్యోగతను
జీతం లేని కూలి అతను
దేశానికి వెన్నెముకతను
తనంటే పుడమి పుడమి అంటే తాను..
తానెవరో కాదు అన్నదాత....

-పవన్ కుమార్
9989237142

## ఏది నిజం ?

ఏది నిజం?
లోపల ఒకటి
బయట ఒకటి
రాత ఒకటి
మాట ఒకటి
ఏది నిజం? మరి ఏది నిజం?
చరిత ఒకటి
చదివేది ఒకటి
చదివింది ఒకటి
ఆ చదువుతో పని చేసేది మరొకటి
ఏది నిజం? మరి ఏది నిజం?
భారతీయులం ఒకటంటూ
విభిన్న జాతులు మనమంటూ
మతాలు వేరైనా గాని
మనుషులంతా ఒక్కటేనంటూ
పెదాల పైనే పలికే మనకు
ఏది నిజం? మరి ఏదీ నిజం?
పరమత సహనం పాటింస్తూ
హృదయస్థ భగవంతుడిని చూస్తూ
మానవత్వపు మనుగడ కోసం
లోపల ఉన్న అబద్ధాన్ని చంపి
నిజమైన మనిషిని బ్రతిగిద్దాం
నిజమైన మనిషినగా బ్రతిగేద్దాం...

-శ్రీపాల్

## తరతరాల కోసం!

ఒక రెక్క
భూమి మండుతుంది
మరో రెక్క
హిమ శిఖరాలు నీరై ప్రవహిస్తున్నాయి
అమెజాన్ తగలబడుతుంది
వెలాండ్ కరిగిపోతుంది
ఇంకెంత కర్బన కల్మషం సృష్టిస్తారు?
మీ సుఖాల కోసం భూగోళాన్ని
నిప్పుల కొలిమిలా పండిస్తారు?
మీ ఆనందాల కోసం భూమ్యాకాశాలను
మలిన కాషారం చేసుకుంటారు?
సముద్రమట్టం పెరుగుతూ ఒకవైపు
ద్వీపకల్పాలు
ముసుగుతూ మరోవైపు
భూగోళం బద్దలైతే
నువ్వావుండవ్-నేనూ వుండ
ఇప్పటికీ మునిగిపోయిందేమీ లేదు
రేపటి తరం కోసం వొకొక్కరు
ఒక్కొక్క మొక్కనాటి వెళ్ళండి
మీ పిల్లలు నీరుపోసి పెంచుకుంటారు
మీ మనవళ్ళు బతికి బట్టకడతారు!



- గుర్రాల రమణయ్య
సెల్: 9963921943

## పొగడ జల్లులు

నీ అడుగులు సాగని
నిప్పులు దారులలో...
చూడు ముందంతా
విజయ బాట....
ఎంతెదిగినా
ఒదిగుండు...
రెపరెపలాడు నీఖ్యాతి
విజయ కేతనమై...
ఓటమి నిప్పులో
కరిగె గుండె....
పదునైన కత్తై
పుట్టడానికే కాబోలు...
ఆశల ఆకులు
రాలుతున్నాయి....
మళ్ళీవేసె కొత్త చివుర్లు
విజయాలకై....

కొండంత పట్టుదల
నీదైతె....
ఆకాశమంత
విజయం నీసొంతం....
రాలే చినుకులలో
ఎంత ఆశ రైతుది...
పంట పండిస్తూ
విజయం సాధించె...
అమ్మ భాషే పట్టు
అన్య భాషలు నేర్వ...
అప్పుడే ఆసొంతం
విజయం నీసొంతం...



-వకుళ వాసు
9989198334

## సూక్తులు

మనిషికి ఊపిరి నమ్మకం
ప్రాణానికి నిర్వచనం నమ్మకం
నమ్మకద్రోహం చేసేవు
నమ్మకంతో గొంతుకోసేవు
నిన్ను నమ్మినవారికి అండగా
నిలువని నీ జీవితం
ఎందుకు మానవ...

పట్నానికి కూసింత దూరం
సదువుకున్నా సదువులేకున్నా
మూఢనమ్మకాలకు జీవం పోస్తూ
రోగమొస్తే పసరుమందు
మంత్రగాడి గాలంలో పడిపోతూ
ఎప్పటికి మారునో ఈ
మనుషుల తీరు మానవ.....



-పి.విశాలాక్షి
9908435805

## రెక్కలు

ఏకాంత
మౌనాన్ని
ఎడారికూడా
భరించలేదు
గాలితో
అందుకే దోస్తీ!

కొంచెం భయం
కొంచెం భక్తి
సామాన్యుల
జీవనం
ఎక్కేది
ఒక్కొక్క మెట్టే

సీనియల్
చూసేవారికి
తెలిపే బోధ
సీ 'రియల్'
అది
'ఎడ తెగనిది'

కొమ్మ కొమ్మకీ
నాదస్వరం
పువ్వు పువ్వుకీ
నాగస్వరం
వాసంతం
మోహనరాగం

నీటిమకరం
కరిపాదం
దొరికితే
వదులునా?
ధార్మాతీతం
స్థానబలం



- ఉమ్మడిశింగు రాఘవరావు
సెల్: 9247108893

## పుడమి తల్లిని ఎదలో కొలుచుకుందాం

ఇప్పుడు దేశం కష్ట కాలాన్ని ఎదుర్కొంటుంది
అన్నం పెట్టే చేతులు ఆందోళన చేస్తున్నాయి
మన్ను నుండి అన్నం తీసే
గొంతులు ఏకమై గోల చేస్తున్నాయి
నీలి చట్టాలపై కన్నెర్ర జేసి
రంకెలు వేస్తున్నాయి
సమస్యల సాధనకు నడుం బిగించాయి..
సూర్యుని నెత్తి నెట్టుకొని
ఊపిరినంతా ఉగ్గ పట్టుకొని
ఒరం ఒడ్డు పెట్టుకుంటూ
పురుగు బూషిని దాటుకుంటూ
ప్రాణమంతా పైరుపైనే గురిపెట్టుకుంటూ
రత్నాల సిరులు రాశులు పోగేస్తుంటే..
ఉరుములు మెరుపులు లేకుండా నే
సాగు చట్టాల పిడుగు పడి
రైతు గుండె ను పిండి చేస్తున్నాయి
నిరాశ సముద్రం లోకి నెట్టేసి
రైతుని , భూమి కి ఎడబాపుతున్నాయి..
కొయ్యకాలు ప్రశ్నల కొడవండ్లై అడుగుతున్నయ్
గడ్డి పోసలు గట్టిగా జల ఫిరంగులను ఎదిరిస్తున్నయ్
పార ,పలుగలు ఉద్యమ పౌరుషాన్ని ఉడుకెక్కిస్తున్నయ్
గొర్రు ,నాగలి పోరాటానికి గొడుగులై నీడ నిస్తున్నయ్..
రండీ ! అన్నదాతలకు అండగా నిలుద్దాం
వాళ్ళ పోరులో పాలుపంచుకుందాం
కలాలను కదిలించి కవనాలతో ఉద్యమా
నికి ఊపిర్లు ఊదుదాం ఎత్తిన పిడికిలి దించేది లేదు
పోరాటాన్ని ఆపేది లేదు
ఉద్యమ ఉధృతిని పెంచుదాం
సాగు చట్టాలను మట్టి లో కలిపేద్దాం
పుడమి తల్లిని ఎదలో కొలుచుకుందాం
(అన్నదాతల ఆందోళనకు మద్దతు గా)



-తాటిపాముల రమేష్
7981566031

# మా నాన్న గ్రేట్

(కథ)

కాలేజీ నుంచి తొందరగా ఇంటికి వచ్చేసిన కూతురితో ఏంటమ్మా ఈరోజు తొందరగా వచ్చేసావ్. క్లాసులు లేవా అని అడిగింది రాధమ్మ. ఏం తొందరగా రాకూడదా. దానికి కూడా పర్మిషన్ తీసుకోవాలా ఎవరి దగ్గరైనా. అంటూ చిరాకుగా తన గదిలోకి వెళ్లి దబేల్మని తలుపు వేసుకుంది రాగిణి. అలా వెళ్లి బ్యాగ్ గదిలో ఓ పక్కకి విసిరేసి మంచం మీద బోర్లా పడుకుని కళ్ళుమూసుకుని ఆలోచనలో పడింది. అసలు ఏమిటి ఇది, నాకే ఎందుకిలా అవుతోంది. నేనేమైన పొరపాటుగా ప్రవర్తించానా? అని పరిపరివిధాలుగా తన లోటుపాట్ల గురించి ఆలోచించడం మొదలు పెట్టింది. జరుగుతున్న దానిలో నా ప్రమేయం గాని, నా తప్పు గాని ఏమి లేవు. కానీ ఇప్పుడేం చేయాలి. ఈ సమస్య నుంచి ఎలా బయట పడాలి. జరిగింది అమ్మా నాన్నలకి చెప్తే, నా తప్పు ఉందాలేదా అని కూడా ఆలోచించకుండా నన్ను కాలేజి మాన్పించేసి ఇంట్లో కూర్చోబెడతారు ఖచ్చితంగా. చదువునాపేయడం నా వల్ల కాదు. ఇపుడేమిటి నా సమస్యకు పరిష్కారం అని సతమతమవుతున్న రాగిణిని అమ్ముదూ భోజనం చేద్దువు గానీ రా అమ్మా అని రాధమ్మ పిలిచేసరికి అపుడే రాత్రి అయ్యిందా అనుకుంటూ... వస్తున్నానమ్మా అంటూ, మొహం కడుక్కుని వచ్చింది. డైనింగ్ టేబుల్ మీద కూర్చుని ఏదో తిన్నానంటే తిన్నాను అన్నట్టు నాలుగు మెతుకులు తినేసి, చేతులు కడిగేసుకుంది. ఏంటే ఆ తినడం అని అమ్మ అడుగుతుంటే, చాలమ్మా ఎక్కువ తింటే నిద్ర వస్తుంది, చదువుకోవాలి పరీక్షలు ఉన్నాయి అంటూ వెళ్ళింది.

పుస్తకం ముందేసుకుని చదువుదామంటే మనసు లగ్నం కావడం లేదు. ఆ రాజేష్ అన్న మాటలే గుర్తుకువస్తున్నాయి. భోగి పండగ ముందు రోజు రాత్రి పన్నెండు గంటలలోపు నువ్ నన్ను ప్రేమిస్తున్నా అని చెప్పక పోతే, నేను చచ్చిపోతాను అని అన్న మాటలు. ఎల్లుండే భోగి పండగ. రేపు రాత్రి దాకానే నీకు సమయం ఉంది అన్నాడు. ఇప్పుడేం చేయాలి అని సతమతమవుతూ ఉండగా, నాన్న గదిలోకి వచ్చాడు.

> పుస్తకం ముందేసుకుని చదువుదామంటే మనసు లగ్నం కావడం లేదు. ఆ రాజేష్ అన్న మాటలే గుర్తుకువస్తున్నాయి.

ఏంటి తల్లి ఏమయ్యింది. నీలో నువ్వే వారం నుంచి బాధ పడుతూ ఉన్నావు. నాకు చెప్పకూడదా నీ సమస్య ఏమిటో అని అడిగాడు. అది కాదు నాన్నా మీరేమంటారో అని , చెప్పలేకపోయా. సరే ఇపుడు చెప్పు అసలేం జరిగింది. నేను నీకు అండగా ఉన్నాను కదా, భయపడకుండా చెప్పు అన్నారు నాన్న.

మన వీధి చివర ఉండే రాజేష్ గత ఆరు నెలల నుంచి ప్రేమ దోమ అంటూ నా వెంట పడుతున్నాడు. నాకు అలాంటి వి నచ్చవు. అసలు నీ మీద నాకు ఆ అభిప్రాయం లేదు అని చెప్పేసాను. అయిన వదలకుండా రోజు వేధిస్తున్నాడు. ఇపుడేమో రేపు రాత్రి లోగా నేను ఐ లవ్ యు అని వాడికి చెప్పకుంటే చచ్చిపోతా అని బెదిరించాడు నాన్నా. ఇప్పుడేం చేయాలో తెలియక బాధ పడుతున్నాను.

సరే పద, రాజేష్ వాళ్ళింటికి వెళదాం. అంటూ బైక్ మీద తీసుకెల్లాడు. వాళ్ళింట్లో రాజేష్ ని వాళ్ళ అమ్మా నాన్నల ముందు కూర్చో బెట్టి ఇలా అడిగాడు నాన్న. " ఏంటి రాజేష్, ఏమో చేస్తా అన్నావంట. రాగిణీ నిన్ను ప్రేమించకుంటే, రేపు మీ ఇంటి ముందు భోగి మంటలు కాకుండా నీ చితి మంటలు వెలుగుతాయన్నావంట. నిజమేనా. అసలు మీ వయసు ఏంటి, మీ వేషాలు ఏంటి. ఆఫ్టాల్ ఒక ఆడపిల్ల ప్రేమించను అంటే చచ్చిపోతావా. నీ తల్లిదండ్రులు నిన్ను ఎంత ప్రేమిస్తున్నారు. నువ్ లేకుండా వాళ్ళు ఉండగలరా అని ఆలోచించావా? ఎందుకు ఆలోచిస్తారు మీరు, మీకు కావాల్సింది హీరోయిజం. గొప్పలు చెప్పుకోడానికి ఒక లవర్ కావాలి. అంతే గాని అది నిజమైన ప్రేమ కాదు. కేవలం ఆకర్షణ. ఇది తెలుసుకో. అని చెప్పి. రాజేష్ వాళ్ళ నాన్న గారితో " నారాయణ గారు నన్ను మన్నించండి. ఇలా మీ ముందు మీ అబ్బాయిని మాటలు అన్నందుకు. కానీ మీకు తెలియాలి వాడు బయట చేసే పనులు అని ఇలా మీ ముందే నిలదీసాను. మేము వెళ్ళాక తనతో మీరు నిదానం గా మాట్లాడి నచ్చచెప్పండి. ఉంటాను అని నన్ను తీసుకుని వచ్చేసాడు నాన్న.

తర్వాత వాళ్ళింట్లో ఏం జరిగిందో, ఏం మాట్లాడారో నాకైతే తెలియదు గాని, భోగి రోజు రాజేష్ మా ఇంటికి వచ్చాడు, వాళ్ళ అమ్మ చేసిన పిండి వంటలు ఇచ్చి, సారీ రాగిణీ నన్ను క్షమించు. నీ విషయంలో తప్పుగా ప్రవర్తించాను. అనిచెప్పి, మా అమ్మా నాన్నలని కూడా క్షమాపణలు అడిగాడు.

నాన్న రాజేష్ భుజం తట్టి, నీ తప్పు తెలుసుకున్నావు. ఇంకెప్పుడు ఏ ఆడపిల్లతో కూడా ఇలా ప్రవర్తించకు. వాళ్ళ మనసు కూడా అర్థం చేసుకోవాలి. సరేనా. నువ్వు రాగిణి మంచి స్నేహితులుగా ఉండండి అని చెప్పాడు.

హమ్మయ్య నిజంగా నా సమస్య తీరిపోయింది. మా నాన్న లాంటి నాన్నలు అందరికి ఉంటే, ఏ ఆడపిల్ల బాధ పడకుండా హాయిగా ఉంటుంది అని, థ్యాంక్యూ నాన్నా , ఐ లవ్ యు సో మచ్ అని నాన్న మెడను చుట్టేసాను.



-దేవలపల్లి సునంద
8297744716

## కొత్తగా రెక్కలొచ్చెనా !

ఇన్నాళ్లూ
జడ పదార్థంలా
దాగుడుమూతలు ఆడిన భయాలు
కొన్ని భస్మీపటలం అయ్యి
జనాలు జనరంజక జీవితాలవైపు
అడుగులు కదపాలి.

కొన్నాళ్లుగా కార్చిన కన్నీళ్లు
చరిత్రపుటల్లో పడి కాలిపోవాలి
జీవన పయనంలో పడిలేచిన
గాయాల గుర్తులు మాని
మరో చరిత్ర వైపు
వడివడిగా అడుగులు ఆశగా కదపాలి.

భయాల్ని సైతం
జయాలుగా మలచి
మనిషిగా మరో మైలురాయిని దాటాలి
నిస్పృహను నిప్పు చేసి
బ్రతుకు బండిని బాటకు చేర్చాలి.

సాయంత్రాన్ని సంధి చేసి
కోటి ఆశలతో
క్రొత్త ఉదయానికి స్వాగతం పలకాలి
అలసిన హృదయాలకు
ఆశయాల ఊపిర్లు ఊది
నవ జీవనం వైపు
కొత్తగా రెక్కలొచ్చిన పక్షిలా దూసుకెళ్లాలి...!!



-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## నోరున్న మూగజీవి

లోకంతో సంబంధం లేకుండా,
రేయింబవళ్ళు శ్రమిస్తూ,
జీవాలను కుటుంబంగా కాపాడుకుంటూ
తన కుటుంబ బాగు కొరకు
అడవుల వెంబడి తిరిగే
కష్టజీవి గొర్లకాపరి
పానం బాగాలేక పోయినా,
ఇంట్ల పండుగలున్న,
దగ్గరి సుట్టాల సావులున్న,
గొర్లె ఎంబడి పోక తప్పదు,
బిక్కు బిక్కు మంటూ
మూగ జీవాలతోనే
కష్ట సుఖాలు పంచుకునే పేదోడు,
తోడేళ్ళు క్రూర జంతువుల బారి నుండి
జీవాలను రక్షించుకునేందుకు
అనుక్షణం ఆరాటపడే
అంగరక్షకుడు ఈ మూగజీవి,
తెల్లందాక కావలి గాసె గొర్ల కాపరికి
చేతి కట్టే, భుజాన గొంగడి
పెంచుకున్న కుక్క, అగ్గి మంట
ఇవే ఆణ్వాయుధాలు,
గొర్రె డెక్కలకు ముల్లుకొడితే
గొర్ల కాపారి భుజాలే
పల్లకిల మారుతాయి....
అడవిల దొరికే ఆకులతోనే
బాగలేని గొర్ల కు నయం చేసే వైద్యుడతడు,
పొద్దులు పడ్డ గొర్లకు
ప్రసవం చేసే మంత్రసానతడు....
గడుసు గొర్లు ఆగక
పోయి చేను మేస్తే,
ఆ యజమాని తిట్లకు
ఎవరిని ఏమనలేక దిగులు పడి
రందితో కుమిలిపోతడు,
నా రాత గింతెనని తృప్తి పడుతడు,
కన్న బిడ్డల వలే
సాకిన మూగజీవులకు
దూరమైతుంటే కన్నబిడ్డను
సాగనంపినట్టు కంటనీరు పెట్టె
పెద్దమనసు గల పసి పిల్లాడతాడు.
తన బతుకుదేరువుకు
వాటి బతుకులపై ఆధారపడ్డ
నిస్సహాయుడు అతడు...
రేయింబవళ్ళు కష్టపడి
సాధుకున్న జీవాలను
దళారులు అగ్గువ ధరకు కొని
మటన్ పెరుతోటి ఎక్కువ
ధరకు అమ్ముకుంటున్నరు....
గొర్ల కాపరి పడ్డ కట్టానికి,
ప్రతి ఫలం శూన్యం,
అయినా మూగజీవాలపై
ప్రేమ మానడు
భుజాన గొంగడి వీడడు
ఎత్తిన కర్రను దించడు
గమనం లేని జీవితం తనది
గమ్యం లేని పయనం తనది
ఆ మూగ జీవులే తన గమనం
ఆ మూగ జీవులే తన గమ్యం...



-వేల్పుల రాజు.
9701933704.

## దేశ రక్షణే .. ధ్యేయం

వెల్లువలా .. దేశభక్తి
ఏరులై పారుతున్న ..
ఎర్రకోట పై
మువ్వన్నెల జెండా
రెపరెపలాడుతున్న..
భారతీయుల గుండెలనిండా
దేశభక్తి ఉప్పొంగుతున్న ..
ఆ ..ఉద్విగ్న క్షణాల్ని
మన కళ్లముందు
సాక్షాత్కరింప చేయడానికై
ఎందరో త్యాగధనులు
అమరవీరులై..
దేశ చరిత్రలో నిలిచారు !
అతి పెద్ద
లిఖిత రాజ్యాంగాన్ని
అమలు చేసి
సర్వసత్తాక ,సామ్యవాద
లౌకిక ,ప్రజాస్వామ్య
గణతంత్ర రాజ్యంగా
ప్రపంచ పటంలోనే
భారత్ ను ముందుంచిన
వీర నేతలు..
ధీర నేతలు ఎందరో ?
వారి బాటన నడుద్దాం
వారి ఆశయాలను సాధిద్దాం
దేశ రక్షణకై పోరాడుదాం !
జై హింద్ .. జై భారత్ !!



-బండారు సునీత
9440671530

## డిజిటల్ యుగ రోబోలు

డిజిటల్ యుగపు రోబోలు
వైరస్ పట్టిన నర సాఫ్ట్‌వేర్‌లు
అర్థం పర్థం లేని ఆరాటాలు
గమ్యమెరుగని గత్తర పరుగులు
ఆద్యంతమే లేని ధనదాహాలు
నైతికత ఇంకిన మర మనుషులు !

అశ్లీలతను ఆరాదించే నేత్రాలు
అబద్ధాలు ఆస్వాదించే చెవులు
ముళ్ళను తలపించే స్పర్శలు
నరమే లేని నాలుక నర్తనలు
కంపుకొట్టే కపట దుర్గంధాలు
పతనం అంచున పంచేంద్రియాలు !

విచక్షణ మరిచిన దురాలోచనలు
దురాశలతో వేలాడే ఊడలు
మర్యాదల వెనుక మతలబులు
ఈర్ష్యలు నిండిన ఇకమతులు
ఇరుగు పొరుగంతా పరలోకులు
చేయూతలు తరిగిన చేతులు !

బంధాలన్నీ వ్యాపార వస్తువులు
స్నేహాలన్నీ తేనె పూసిన కత్తులు
విత్తం వెంట వేలం వెర్రి పయనాలు
నరుల తోలు తొడిగిన గుంట నక్కలు
నవ్వుల వెనుక ప్రతీకార జ్వాలలు
హితవరుల వేషంలో అసురులు !

అంతర్జాల సాగరమథనాలు
సాధించాలి స్మార్ట్ ఆణిముత్యాలు
నిర్మించాలి ప్రేమల పొదరిల్లు
చేరాలి ఆనందపు అంచులు
వికసించాలి నవ్వుల పువ్వులు
పరిమళించాలి వసుదైక కుటుంబాలు !

చిగురించాలి మానవీయతలు
నాటాలి ఆంటీవైరస్‌ల విత్తులు
చెరపాలి అవాంఛనీయ గోడలు
విలువలతో వర్ధిల్లాలి ఆత్మీయతలు
ఇంటర్'నెట్' అల్లాలి అనుబంధాలు
నరులు కావాలి నారాయణులు !



-బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 'రంగినేని' సాహితీ సర్వస్వం..

పుస్తక సమీక్ష





సాహిత్య సృజననే తమ శ్వాస.. ధ్యాసగా భావించిన రంగినేని సుబ్రహ్మణ్యంగారు పాత మహబూబ్‌నగర్ జిల్లా వాస్తవ్యునిగా సాహితీ లోకానికి యువకవిగా ముద్ర వేసుకుని.. మూడు దశాబ్దాల వయసు నిండకముందే స్వర్గస్థులైనారు.. బతికున్నది.. తక్కువ కాలం అయినప్పటికీ.. ఆయన తమదైన శైలిలో సాహితీసేద్యం చేసి అందరి దృష్టి నాకర్షించారు. 1970 దశకంలో రంగినేని సుబ్రహ్మణ్యంగారు వెలువరించిన "సిత పుష్ప మాల" "జీవన హేళ", "మనసుగీసిన చిత్రాలు" మరియు "తూర్పు కనులెర్ర చేస్తే" కవితా సంపుటాలు ఆయనకు కవిత్వం పట్ల ఉన్న శ్రద్ధాభక్తుల ను.. సమాజం పట్ల ఉన్న బాధ్యతను ప్రతిఫలింపజేసేలా.. సాహితీ రంగంలో పెద్దల నుండి చిన్నల వరకు అందరి మన్ననలు పొందడం విశేషం. రంగినేని సుబ్రహ్మణ్యం గారు 1979లోనే మృతి చెందినప్పటికీ.. ఆయన నాలుగు గ్రంథాలను ఏర్చి కూర్చి.. "రంగినేని సుబ్రహ్మణ్యం సాహితీ సర్వస్వం" పేరుతో ఉమ్మడి పాలమూరు జిల్లా రాకేష్ వికాస మిత్ర సామాజిక సాంస్కృతిక సంస్థవారు వెలువరించి ఆయన సాగర మథనానికి శ్రీకారం చుట్టారు. సుబ్రహ్మణ్యంగారు సినారె.. కపిలవాయి లింగమూర్తి.. కె.విమల.. వల్లభాపురం జనార్ధన, జి.చంద్రమౌళి శర్మ, ఎల్లారి శివారెడ్డి, తిరుమల శ్రీనివాసాచార్య తదితర సాహితీవేత్తల అభినందన చందనాలను అందుకోవడం విశేషం..

"సిత పుష్పమాల" పేరుతో రంగినేని గారు భావ కవితా సంపుటిని 1973 ప్రాంతంలో వెలువరించి.. తమ కవితా పటిమను చాటుకున్నారు.

కవి అనేవాడు..

**ఇనుప గజ్జెల తల్లి ఒడిలో**
**కునుకు దీయుచు కృంగిపోయిన**
**"జాతి"కి అండగ ఉండి**
**"జాగృతి"ని వెలయించుచుండును**

అంటూ

కవి యొక్క బాధ్యతను ఈ గ్రంథంలో ఉన్నతంగా ఆవిష్కరించారు.

'విన్నపం' శీర్షికతో రాసిన కవితలో నీ సుధా నిలయంలో నాకు కాస్త చోటు యివ్వుమంటూ నటరాజశేఖరుని వేడుకున్నారు.

దగాకోర్లను హతమార్చి..
ధరణి భరత నవసంస్కృతి నిలుపగ
ముందడుగు వేయాలని ప్రజా ప్రతినిధులకు హితవు పలుకుతూ 'ఆలోడనము' కవితను ఇందులో పొందుపరిచారు.

'మనిషి' కవితలో మనిషి అంటే ఎలా ఉండాలో చక్కగా తెలియజెప్పారు. "మనిషి" అనే శిల్పానికి మానవత్వముంటేనే.. జీవమున్న మనసుగల మనిషిగా రాణిస్తాడని వివరించారు.

**'రాతి రేమో కరిగిపోయే**
**రాడాయె నా రాజు.."** అంటూ రమణీయ భావాలతో 'వలపుగీతి' కవితను రాశారు.

సినారెగారు అభిప్రాయపడినట్లు.. ఈ గ్రంథంలో రంగినేనిగారి సుందర పదఘటనం.. సుకుమార భావస్ఫోటనం అగుపిస్తాయి.

రంగినేనిగారు ఇలా "సిత పుష్పమాల" భావ కవితా సంపుటిని తీర్చిదిద్దారు.

1974లో రంగినేనిగారు "జీవన హేళ' పేరుతో మరో కవితా సంపుటిని వెలువరించారు. డా॥ నాయని కృష్ణకుమారి, డా॥ఎస్.వి. రామారావు, తదితర సాహితీవేత్తల ముందుమాటలతో ముస్తాబై వచ్చిన ఈ గ్రంథంలో.. మధుర భావాంతరాన్ని ఆవిష్కరించుకున్నారు. కవి గురించి.. శ్రామికుని గురించి.. రాసిన కవితల్లోని పంక్తులు అందరినీ ఇట్టే ఆకట్టుకునే విధంగా కొలువుదీరాయి. "అన్వేషణ" శీర్షికతో రాసిన కవితలో "మమత.. సమత.. మంచితనము".. "మనిషి పంచి పెడుతుంటే'.. కాటేస్తుందీ "విధి" అంటూ వాపోయారు. ఆవేశం.. ఆరాటం.. ఆగ్రహాల రంగరించి.. "విధి"ని పిసికి వేయాలని.. "విధి"కి బుద్ధి చెప్పాలంటూ.. తమ అంతరంగంలోని భావాలకు అక్షరాకృతినిచ్చారు.

స్వార్థాన్ని సమాధి చేస్తేనే.. జనతవెతలు తొలుగుతాయనీ.. "శాంతి" కనుల నెలవెన్నెల "క్రాంతిగీత" పాడుతుందని "స్వార్థం" కవితను రూపుదిద్దారు.

" నా కలం" శీర్షికతో రాసిన కవితలో నా కలం ఒక దివ్య నర్తకి అంటూ ప్రారంభించిన తీరు బాగుంది. నా కలమ్మొక రుద్రవీణ, న్యాయం ఎప్పుడు గెలుస్తుందని అభిప్రాయపడ్డారు. "అభిసారిక" కవితలో కవి రంగినేని ప్రకటించిన భావాలు రమణీయతను సంతరించుకున్నాయి.

స్నేహానికి అర్థం మనసులు కలియటం అని తేల్చి చెబుతూ "స్నేహ నేత్రయాత్ర" కవితను రాశారు.

ఇలా వివిధ కవితా వస్తువులపై వైవిధ్యమైన రీతిలో తమ భావాలను ప్రకటిస్తూ ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దారు. 1977 ప్రాంతంలోఓ "మనసు గీసిన చిత్రాలు" పేరుతో తమ మూడో పుస్తకాన్ని వెలువరించి రంగినేనిగారు తమ కవితా ప్రతిభను చాటుకున్నారు.

**"మనిషి కథ పాడుతా**
**మమత నిల నిలుపుతా"** అంటూ రంగినేనిగారు "దివ్య దర్శనం" కవితను రాశారు. "కాంతిరేఖను నేనంటూ" సుకుమార భావ కుసుమాలను మనకందించారు.

**మనిషిని మనీషిగా**
**మార్చునది నవకవిత**
**కవిత వెన్నెల పంట"** అంటూ "కవిత" పేరుతో కవిత రాసి అందరినీ మెప్పించారు. "మనసుకు మనసే వ్యాఖ్యానమంటూ" "మనసు గీసిన చిత్రాలు" కవితనను రాశారు.

**"మనిషి మనసు పొదుగును పిండి**
**మనసు క్షీరాల్ని పితికి"** అంటూ చక్కని ఎత్తుగడతో "మనిషి-ప్రకృతి" కవితను ప్రారంభించారు.

**తర తరాల దారిద్ర్యపు**
**గరళమ్మును మ్రింగుతునే**
**బడా బడా ధనవంతులకు**
**బానిసగా బతికే కార్మికుల**
**వ్యథలకు అద్దంపడుతూ** "కార్మికా" కవితను తీర్చిదిద్దారు.

"మనసు పాడిన మధురగీతం' పేరుతో రాసిన గేయంలో అలకమానరా కృష్ణా.. నాపై చలమదేలరా కృష్ణా అంటూ కొనసాగించిన పంక్తులు బాగున్నాయి.. సినారెగారిపై తమకు ఉన్న గౌరవాన్ని చాటుకుంటూ ఓ కవితను ఇందులో పొందుపరిచారు. సినారె గ్రంథాలను విశ్లేషిస్తూ.. ప్రస్తావిస్తూ ఈ కవితకు రూపమిచ్చారు. ఇలా విభిన్నమైన అంశాలతో వచన కవితలకు-గేయాలకు పాటలకు చోటు కల్పిస్తూ కవి రంగినేనిగారు తమ కవితాత్మను ప్రకటించుకున్నారు.

రంగినేనిగారి నాలుగో గ్రంథం "తూర్పు కనులెర్ర జేస్తే" పేరుతో వెలుగులోకి వచ్చింది. చక్కని అభివ్యక్తి.. శిల్పంతో తీర్చిదిద్దిన ఇందలి కవితలు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి.

'తూర్పు కనులెర్ర జేస్తే.." శీర్షికతో రాసిన మొదటి కవితలోనే.. కవి రంగినేనిగారు చక్కని భావాలను ప్రకటించారు.

**ఆకాశం..**
**నిద్దుర లేచింది**
**అవనీతలాన్ని**
**తట్టి లేపింది"** అంటూ అందమైన భావాలను అక్షరాల్లో బంధించారు. కవి పండించే కవిత్వం చైతన్యవంతంగా ఉండాలని కాంక్షించే ఆయన "చైతన్యా" శీర్షికతో రాసిన కవితలో చైతన్యమే కవితకు ఊపిరి.. అంటూ రాసిన పంక్తి ద్వారా కవిత్వం యొక్క పరమార్థాన్ని వివరించారు.

'ప్రబోధ' పేరుతో రాసిన కవితలో వర్తమానంలో.. నడుస్తున్ననాకు.. ఈ కవుల.. అంతరంగాల వ్యసనాలు అద్దంలా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు.

'అక్షర శిల్పిని.. నేను కవిని" అంటూ రాసిన కవితలో.. ఆరంభంలోనే.. గుండెల్లో మండే గాయాల నుండి కారిన ఎర్రని రక్తం అంటారు. అనడం ఆయన అభ్యుదయ భావాలను ప్రకటించేలా ఉంది.

సత్యం ధర్మం.. వెలయిస్తాం.. నిత్యం జాతిని సేవిస్తాం.. క్రాంతి పథమ్మున పయనిస్తాం.. జాతీయతనిల వెలయిస్తాం.. అంటూ "విప్లవ గీతం" కవితను రాశారు. "ఉదయం-హృదయం", "నేనూ ఉదయాన్ని", "సంఘర్షణలో ఆకర్షణ", "ప్రేరణ", "అంతర్వాణి', "గుంజాటన", శీర్షికలతో రాసిన కవితలు ఈ గ్రంథానికి శోభను కూర్చాయి.

ఇలా.. రంగినేనిగారి నాలుగు గ్రంథాలలోని కవితా పంక్తులు ఎన్నో ఉదహరించడానికి వీలుగా ఉన్నాయి.. రంగినేని సుబ్రహ్మణ్యం ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాకే కాక.. రాష్ట్ర వ్యాప్త సాహితీ రంగాన్ని తమ రచనల ద్వారా సుసంపన్నం చేశారు. మానవీయ కోణంలో సామాజిక చైతన్యమే ఆలంబనగా సాగిన ఆయన రచనలు ఇప్పుడు ఆయన లేకున్నా అక్షరాలు అజరామరంగా వుండి అందరినీ చైతన్యపరుస్తున్నాయి. రంగినేనిగారి సాహిత్య సమాలోచనకు అవకాశం కల్పించేలా ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దిన ఆయన బందు మిత్రు లకు అందరికీ అభినందనలు తెలియజేద్దాం..

**ప్రతులకు:**
రంగినేని మన్మోహన్
శ్రీ మణికంఠ రాకేశ్ నిలయం
ఇ.నెం. 6-101/2
బి.కె.రెడ్డి కాలనీ,
పాలమూరు-509 001
సెల్: 9059594747



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## మనసు దోచిన చిత్రాలు

దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది
ఆస్వాదించే మనసుండాలె కాని
అన్నీ అద్భుత దృష్యాలే
మనచుట్టూ ఉన్న ప్రకృతి లో
చూడచక్కని రూపాలు
మనసు పెట్టిచూడాలే కాని
తీరొక్క వింతలు తిష్ట వేస్తాయి!

పచ్చని చెట్లపై పరుగులు తీసే
సీతాకోక చిలుకలు
పూదేనియల కోసం పరుగు లు తీసే
గండుతుమ్మెదలు
పచ్చని చెట్లకు రంగు రంగుల
లు పుష్ప విలాసాలు
అందాలతో కనువిందు చేసే
రంగు రంగుల పక్షులు
విచిత్ర ఆకారాలతో అలరించే జంతుజాలం!

పౌర్ణమి వెన్నెల్లో పరుగులు
తీసే చందమామ అందాలు
ఖగోళంలో కనువిందు చేసే
గ్రహాల కూటమి
సముద్రాల్లో సందడి చేసే
వింత విచిత్ర జవజీవాలు
చుక్కల్లో వెలిగిపోయే చక్కనయ్య
చందమామయ్యా
నింగిలోని ఇంద్రధనుస్సు
రంగులతో కనువిందు చేస్తాయి!

ఆకాశాన్ని తాకే అద్దాల
అంతస్తుల భవనాలు
డాంబర్ రోడ్లపై రుయ్ మని
దూసుకెళ్ళే వాహనాలు
నింగి నుండి నేలకు జాలు
వారే వర్షపు జల్లులు
నేలమ్మకు తానం పోసినట్లు
ప్రకృతి మాతకు పచ్చని పట్టు వస్త్రాలు తొడిగినట్లు
చెట్ల నుండి వీచే చల్లని గాలులు
తీయని ఫలాలు,పుల్లని కాయలు,
సుగంధాలు వెదజల్లే పుష్ప పరిమళాలు
రైతన్నల ఎదలపై మట్టి వాసన పరిమళాలు
ఏది ముట్టినా ఏది పట్టినా
అన్నీ వైవిధ్య దృశ్యాలే !



-కోణం పర్శరాములు
9959524585

## మనిషి బొమ్మ- మనసు మరబొమ్మ

మనోశాస్త్రాలను
యంత్రరూపంలోకి తెస్తే
మానవరక్తంలో విషం విరిగి
రంగు మార్చుకున్న రక్తం
ఒక్కొక్కరిలో ఒకోరకంగా
ఒక్కరికి ఒక్క ముఖాన్నే
బొడ్డుతాడుతో అనుసంధానం చేసి,
ప్రేమామృతాన్నిఇంధనంగా స్రవించి
మనసు మరబొమ్మలా
మనిషిని నడిపిస్తుంది.

అవిశ్రాంతంగా
మెదడులో గూడు కట్టుకున్న
ఊహలకు రెక్కలు మొలిచి
మనసు సంకేతాలను
సాంకేతికంగా గౌరవిస్తూ,
ప్రతి అనుభవాన్ని అర్థంగా మార్చి
మరకల్ని తుడిచే
అదృశ్య హస్తమొకటి
తప్పటడుగులు లేని దారిలో
స్వచ్ఛంగా నడిపించాలని
ఓ చిరునామాతో
చిరుస్వాగతం పలుకుతుంది.

అడుగు వేస్తే అనుమానాల అడుసు.
కునుకు తీస్తే భీకరమైన కల.
కూరుకుపోతున్న భావోద్రిక్త వేళలో
వేలాడుతున్న భావాలకు
వాలిపడే మాటకు
రాలిపడే అర్థాలు
గాజుపెంకుల్లా గుచ్చుకొంటే...
దూరమైన మనిషే
ఒంటరిలో దగ్గరైన నరకం.

ఎండమావిగా నమ్మకంతో
నడి రాతిరి వడగాల్పుల
సెగలు కమ్మే ఆలోచనకు
మనసు చాపలా ముడుచుకొని
చింతల్ని తలచుకొని
చీకటిని కప్పుకొని
వెలుగు గువ్వను కంటి ఇంటి దరిదాపుల్లో
వాలకుండక పారద్రోలిన
ప్రతి పలుకులోని అంతర్థాల కింద
నలిగిన మనిషికి నిద్ర దూరమైనా
నిజాలు దగ్గరయ్యాయి.
కలలు రాకపోయినా
కపటాలు తెలిసాయి.

అంగుళం వదలకుండా
మనసును ఆక్రమించి
ఆక్రందనకు గురి చేసే కళ తెలిసిన
ఓ విద్యాలయం ఒంటరితనం.

గతాన్ని తవ్విపోసికొద్ది రాసులుగా
బయటపడే నిజాలు
గుట్టలుగా పేరుకుపోయి
మనిషిలోని అహాన్ని సమాధి చేస్తుంటే
జీవితం నల్ల కలువ.
మెల్లగా ముడుచుకొని
తెలుసుకొనే తెల్లని పొద్దులో
హృదయంలో మృదుకదలికకు
మాటలు నేర్పే తల్లిదనం సహనం.

అకారణ అసందర్భ వేళలో
నిరాదరణ నిప్పులా
నీడను హరించి
ఒక్క క్షణం
పిడుగులా నడినెత్తిన తాకింది.

వణికిన వర్తమానం
కాలిన ఒంటితో
ఒంటి కాలి పరుగుతో
ఒంటరిగా ఓటమి ఒడిని చేరి
రేపు ఉదయాన్ని శాసించే
ఓ కిరణమై ఎలా మెలగాలో
ఓ పుంజమై ఎలా మెదలాలో
ఆ రాతిరి రేపటికి గురిపెట్టిన
బాణంగా మార్చి
ఓటమి ప్రేమతో కౌగిలించుకొని
నేర్పిన విలువిద్య ఆత్మస్థైర్యం.

తాకడానికి వీలుకాని జ్ఞానాన్ని,
పుస్తకంలోకి నడచివెళ్లలేని సోమరితనానికి
చేరదీసుకోలేని విజ్ఞానం
ద్రావక రూపంలో
మెదడు పొరల్లో విస్తరించి
కళ్ళకు మెరుపులు పూస్తున్నాయి.
నాలుక నడక నేర్చుకుంది.

మనిషిలో మరో మనిషి విడివడి
అనుభవ భావజాలంతో
శుభ్రపడిన మనసులోని ప్రతి పొర
సూక్ష్మ ప్రశ్నలకు స్పందించే
శుభసమయంలో
మనిషి వేసే ప్రతి అడుగు శబ్దం
ప్రపంచానికి ఓ శుభసంకల్పమే.



-చందలూరి నారాయణరావు
9704437247

## జయహో కిసాన్!!

వాళ్ళేం ఉగ్రవాదులు కాదు
ఉన్నపలంగా తీసుకెళ్ళి
ఉరి కొయ్యకు వ్రేలాడదీయడానికి!
వాళ్ళు...
తాము పస్తులుండి
దేశం పొట్ట నింపడానికి
దేహాన్ని చెమట దారలతో చుట్టి
ఆరుగాలం విశ్రమించకుండా
బువ్వపెట్టి బతుకునిస్తున్న
మట్టి మనుషులు!!.
వాళ్ళేం తీవ్రవాదులు కాదు
తుపాకీలు గురిపెట్టి
బూటకపు ఎన్కౌంటర్లు చేయడానికి!
వాళ్ళు...
సేద్యం కోసం
తలను తాకట్టు పెడుతూ
విపత్తుల ధాటికి వెన్నువిరిగి
మిగిలిన పంటకు గిట్టుబాటులేక
దళారి గెద్దల పాదాల క్రింద
నలిగిపోతున్న అన్నదాతలు!!.
కూడు పెడుతున్న
ఆ కర్షకులకిప్పుడు కష్టమొచ్చింది
న్యాయమైన మద్దతు ధర
బడాబాబుల హవాలో
అన్యాయమైపోతోంది!.
ఏలినవారి వాగ్దానాలు
ఏటిలో కలిసిపోయాయి
ఆదుకునే ఆపద్భాందవుడు
అధిష్టాన కుర్చీకి
నగిషీలు చెక్కుతున్నాడు!.
ఆక్రోశించిన ఆ హృదయాలిప్పుడు
ఉప్పెనలా మారి ఢిల్లీ గల్లీలలో
యమునా తరంగాలయ్యి
పంతం వీడని ప్రభుత్వానికి
కంటిలో నలుసయ్యాయి!.
భారీ విలయాలు ఎదుర్కొన్న
ఆ గుండె ధైర్యానికి
భాష్ప వాయువులు బెదిరిపోయాయి
కాయాకష్టం చేసిన ఆ కాయాన్ని తాకి
లాటీలు సైతం నెవ్వరపోయాయి!.
చెమట వాసన వారు భరించి
చందన పరిమళాలు మనకు అద్దిన
వారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం!.
చట్టం చేసిన మద్దతు ధర కోసం
చకోరాలై ఎదురుచూస్తున్న
దేశానికి వెన్నెముకలైన వారి కోసం
వెన్ను దన్నుగా నిలవడం తప్ప
జై కిసాన్! జయహో కిసాన్!!



- వాడపర్తి వెంకటరమణ,
81795 78895.

## రైతు కష్టం....

నాగలి పట్టి
సాలు వేసి
సాలు,సాలుకు
పసుపు కొమ్ములను పెట్టి
చెమట చుక్కలు జాలువారు
రైతు కష్టం చూడు, చూడు
వాన రాక
ఎండ వేడికి
పసుపు మొలకకు
ప్రాణంపోసే
రైతు బాధను చూడు,చూడు
గర్భంలోని బిడ్డ మాదిరి
తొమ్మిది నెలలు
రక్షణ చేసి
పురిటి నొప్పులా తీరు
పసుపును తీసే
రైతు కష్టం చూడు ,చూడు
ఎండలోన ఉడకబెట్టి
గాలివానలకు
కాపు కాయు రైతు శ్రమను చూడు చూడు...
బంగారమోలే పసుపును చేసి
మార్కెట్ కు తీసుకెళితే
ధరలు రాక
దగాపడ్డ రైతును చూడు చూడు
ఎంత కష్టం ,ఎంత కష్టం...

-శ్రీపాల్
8978894808

## గునుగు పూలు...





**"కనికరించాల్సిన ప్రకృతి**
**కన్నెర్ర జేసింది**
**మేలుకో మిత్రమా మేలుకో**
**మార్పు అనివార్యం**
**ప్రకృతితో చెలిమి చేద్దామంటూ.."**

పదుగురికి ప్రేమను పంచేందుకు.. కవయిత్రి శ్రీమతి ఉదయశ్రీ ప్రభాకర్‌గారు తమ "గునుగుపూలు" కవితా సంపుటి ద్వారా పిలుపునిచ్చారు.

**"ఆధునికత మోజులో పడి**
**ఆకాశ హర్మ్యాలు నిర్మించి**
**ఆశల ప్రవాహంలో**
**ఆకుపచ్చదనం కొట్టుకుపోతే**
**ఆక్రోశించి ఆక్రోశించి**
**అవని గుండె ముక్కలైందని"** అంటూ మార్పు అనివార్యమని నొక్కి వక్కాణించిన కవయిత్రి ఉదయశ్రీ ప్రభాకర్‌గారు భూగోళం అగ్ని గోళం కాకముందే మేలుకో మిత్రమా అంటూ 'పచ్చదనం సాక్షిగా' హితవు పలికారు.

తరువులతో కరువును తరుముదాం..

పుడమి తల్లికి పచ్చల పతకం చేయిద్దామని కాంక్షించారు.

మట్టి పరిమళంలో

మనిషి బ్రతుకు చిత్రం దాగుందన్న జీవన సత్యాన్ని 'మట్టి బంధాలు" కవిత ద్వారా అందరినీ ఆకట్టుకునేలా మట్టి బంధాలన్నీ చివరికి మట్టి బంధాలేనని తేల్చి చెప్పారు.

మానవీయ పరిమళాలు గుబాళింపజేస్తూ కవయిత్రి ఉదయశ్రీగారు ఈ కవితా సంపుటిని ముస్తాబుచేశారు.

'పూలజాతర' కవితలో.

పసిడి అందాల తంగేడు పూల సోయగాలను.. రంగుతానాలు చేసిన గునుగుపూలను.. తొంగి చూసే పోకబంతి పూలను, నేనే ముందనే గుమ్మడాకును.. అందంగా ఆవిష్కరిస్తూ బంగారు బతుకమ్మ సంబరాల నేపథ్యాన్ని చక్కగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. పుట్టింట్లో పురివిప్పిన మయూరమై.. ఆనందంగా.. మాటల మూటలిప్పి.. నవ్వుల మువ్వల సవ్వడులతో.. తోబుట్టువు లందరు చేసే సందడిని ఈ కవితలో అక్షరబద్ధం చేశారు.

మరో కవితలో

'ముద్ద బంతులను ఆత్మీయ పుష్పంగా.. పేదవాన్ని పెన్నిధిగా పరిచయం చేశారు.

**పూజా పునస్కారాలలో**
**తీర్థంలో దర్శనమిచ్చి**
**ఆనందాల కాంతులతో మెరిపిస్తూ**
**కోరుకున్న కోరికలకు ప్రాణం పోసి**
**ఔషధ గుణాలతో గొంతులో చేరే**

"తులసి మొక్క' ప్రాశస్త్యాన్ని తెలియజెబుతూ 'పవిత్రతకు నిదర్శనం' కవితను రూపుదిద్దారు.

**తెలంగాణలో విరిసిన పూలవనాలు**
**మా గునుగు పూల వనాలు..**
**పరుగు పరుగున వస్తున్నాయి**
**వనాలలోని విరులన్నీ**
**బతుకమ్మ వచ్చిందని బతుకమ్మలో తాను నిలవాలని గౌరవమ్మను చూడాలని** ఆరాటపడతాయన్న అర్థం ధ్వనించేలా.. "గునుగుపూల"ను గొప్పగా దృశ్యమానం చేశారీ కవితలో! బతుకమ్మ పండగంటే.. బడుగు జీవులకు బతుకునిచ్చే పండగ.. ఆడబిడ్డలకు ఆనందాన్నిచ్చే పండుగగా కవయిత్రి ఈ కవితను తీర్చిదిద్దారు.

కవయిత్రి "ప్రేమ సంతకం" కవితలో.. రమణీయ భావాలకు చోటు కల్పించి.. తమ భావుకతను చాటుకున్నారు.

**"నను చూసి మెరిసే నీ కళ్లు.. వేల చంద్రులు కాచే వెన్నెలలా వెలిగిపోవడం**
**ఆశగా ఆత్రంగా నన్ను అల్లుకునే ఆ చూపులు**
**ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయనీ.. చూపుల తాకిడికి మెలికలు తిరిగే మనసు.. చక్కిలిగింతలు పెట్టినట్లు మురిసే క్షణం.. ఒక నవ్వుల వర్షం"** అంటూ కొనసాగించిన పంక్తులు ఈ కవితకు శోభను కూర్చాయి. మనసును మనసు దరి చేరి.. మౌన భాషణం చేసుకుంటే.. పొందే అనుభూతులను అందంగా ఆవిష్కరించడంలో కవయిత్రి సఫలీకృతులైనారు.

**"జీవిత చదరంగంలో ఓడిపోవద్దనీ..**
**కాలం మిగిల్చే కన్నీళ్లను అద్దుకుంటూనే**
**రాబోయే ఆనందాలను తలచుకుని చిరునవ్వులు**
**పూయిస్తాను ఆకాసాన మెరిసె నెలవంకలా"**
అంటూ ఆశవహ దృక్పథంతో 'జీవన ప్రవాహం" కవితను మలిచారు.

వివిధ రకాలైన వివక్షను అవరోధాలను అధిగమిస్తూ నేడు సమాజంలో స్త్రీల స్వాభిమానంతో కుళ్ళు రాజకీయాలైన మలినమంటని తామరులై.. మేకవన్నె పులుల నడుమ చిక్కని లేడిలా.. వ్యక్తిత్వమే రక్షణ కవచమై నిశ్శబ్ద సాగరంలా సాగుతున్న తీరును "సమాజంలో స్త్రీ" కవితలో చక్కగా చిత్రించారు.

'స్వేచ్ఛ' కవితలో మహిళల వ్యథలకు అద్దంపడుతూ కవయిత్రి ఆర్ద్రంగా తమ భావాలను ప్రకటించారు. అవసరాల వెలుగులో ఆడతనం చిరునామాగా మారి.. స్త్రీత్వం కొల్లగొడుతున్న పరువు ప్రతిష్టల గోడలు దాటి మౌనాలను మోస్తుందని వాపోయారు. జీవితం భిక్ష కాదు. హక్కుగా మలుచుకుని.. సంకల్పాల వెలుగులో విస్తరించాలని హితవు పలికారు.

'ఉదయకాంతులు' కవితలో ఉదయశ్రీగారు ఉషోదయ సోయగాలను అందంగా దృశ్యమానం చేశారు. రవికిరణం సోకగానే.. అలిగి ముడుచుకు పోయిన మొగ్గలన్నీ.. బుగ్గలపై.. చిరునవ్వులతో పరిమళాలు వెదజల్లుతూ విచ్చుకున్నాయనీ. ప్రకటించిన తీరు బాగుంది. 'అడవి మల్లెలు' కవితలో.. అడవితల్లి బిడ్డలువారు.. చెట్టూ పుట్టతో చెలిమి చేస్తూ.. వాగు.. వంకలా సాగిపోతూ బ్రతుకులు సాగించే అడవి బిడ్డలను అర్థవంతంగా ఆలోచనా త్మకంగా ఆవిష్కరించారు.

తెలంగాణ తొలిదశ ఉద్యమానికి ఊపిరై.. మలిదశ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన.. చాకలి ఐలమ్మను ఉన్నతంగా ఆవిష్కరిస్తూ మరో కవితను ఇందులో పొందుపరిచారు.

"వణుకుపుడుతుంది" కవితలో.. మనసులు మరుగుజ్జులై.. చూపులతో దోపిడీ చేస్తూ.. సంస్కార హీనులై.. కసుగాయలను కర్కశంగా నలిపేస్తున్న మృగాళ్ళను ఎండగట్టారు. 'ఆడవాళ్ళ'పై అఘాయిత్యాలు చేస్తూ.. చట్టాలకు చిక్కని ఘరానా మాయగాళ్లను చూస్తుంటే వణుకుపుడుతుంది జననమంటేనే" అంటూ కవయిత్రి తమ ఆవేదనను ప్రకటించారు.

ఇలా చక్కని భావుకతతో చిక్కని కవిత్వాన్ని పండించిన కవయిత్రి ఉదయశ్రీగారు అభినందనీయులు. ఆశయాలకు ఊపిరి పోస్తూ.. భావాలకు వర్ణాలు అద్దుతూ.. సాగిస్తోంది అక్షరం పారే సెలయేరు తానై.." అంటూ "అక్షరం" కవితలో సవినయంగా ప్రకటించిన ఆమె.. ప్రేమ భావాలకు ఊతమిస్తూ.. ఊహలకు రెక్కలు కట్టి ఊరేగించే యత్నం చేశారు. ఉదయశ్రీగారు తమ కవిత్వం ద్వారా.. కొత్త లోకాలను మదికి దర్శింపజేస్తూ ప్రేమామృత భావనలను పంచి పెట్టారు.

మరుగైన భావాలను వెలుగులోకి తెచ్చే కాంతి పుంజమే కవిత్వమని భావించే ఉదయశ్రీగారు మనిషి మనసును నిద్రలేపే విధంగా భావతరంగాలను ఔచిత్యవంతంగా.. ప్రభావవంతంగా.. ప్రతిభావంతంగా అక్షరాల్లో బంధించారు.

ప్రకృతిపట్ల ప్రకృతి రమణీయతపట్ల మక్కువ చూపే ఉదయశ్రీగారు ఈ పుస్తకం నిండా భావ కవిత్వానికి ప్రకృతి సౌందర్యానికి పెద్దపీట వేసి పాఠకులకు ఓ మధురానుభూతిని కలిగించారు. ఆమె కవిత్వంలో ఆమె ఉత్తమ వ్యక్తిత్వాన్ని.. సున్నిత మనస్తత్వాన్ని సామాజిక చింతనను అడుగడుగునా చూడగలం. వివిధ వర్ణాల సుమ సుగంధాలను ఆస్వాదించగలం.

**ప్రతులకు:** ఉదయశ్రీ ప్రభాకర్
ఫ్లాట్ నెం.203, పద్మాక్షి హైట్స్
పద్మాక్షినగర్ కాలనీ, హన్మకొండ
వరంగల్ అర్బన్-506 001
సెల్: 9866687134



**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## మేలుకో -ఓ యువతరమా

తలుచుకుంటే
తరతరాలను అంతరిక్షంలో అడుగులేయించే
మేధస్సు నీది...
చరవాణికి తాకట్టుపెట్టి వృథాచేస్తున్నావెందుకు....

ఒళ్ళువిరిచి నిలబడితే
శత్రుమూకల్ని బెంబెలెత్తించే గుండెబలం నీది...
స్వార్థపు వాయువునింపి కలుషితం చేస్తున్నావెందుకు...

ఆలోచనకు నడకనేర్పితే
భారత ఔన్నత్యాన్ని దిగంతాలకు చాటే ధీరత్వం నీది...
పబ్బులసంస్కృతిలో మునుగుతూ పతనమవుతున్నావెందుకు...

మేలుకో యువతరమా...!
విశ్వవ్యాప్తమయ్యే విజ్ఞానం నీ సొంతమేగా....
యోచనకిక ఆయువుపొయ్యి
మానవత్వానికి పాదులేస్తూ....
విచక్షణకిక పునాదివెయ్యి
విలువల కోటలు నిర్మిస్తూ....



-స్వప్నకృష్ణ
9440536669

## దేశం నాకు శానా బాకీ

మా జన్మలు పుట్టుకతోనే
దుబ్బతో,ధూళితో విడదీయరాని
అనుబంధం విచిత్ర సంబంధం
సదువబ్బని మనుషులం
కుటుంబ గడవని కడు దరిద్రులం
ఇంట్లో ఎప్పుడూ ఆకలి అమవాస్యాలే
నీళ్లులేని దృశ్యాలకు కనుగుడ్లే సాక్షం.
చెంపలు అగాదాలను తలపిస్తాయి
పళ్లు ఎప్పుడు పాకురుతో
పాను,గుట్కా,తంబాకు మిశ్రమాలతో
గొంతురోగాలకు ఆధారంగా ఉంటయి.
బక్కచిక్కిన ఎముకల్ని కప్పిఉంచే
దుబ్బ సంచిలాంటి సొక్క
మట్టితో నిండినా లాగులే మాకు నిత్య వస్త్రాలు...

పుట్టిన సోటు
మాట్లడే భాష
తినే తిండి,ఉండే అలవాట్లు
తెలిసిన సోటిడిసి, కొత్త సోటుకు
కలిసుండే సుట్టాల్ని,
అనుబంధ పేగుబందాల్ని
ఆత్మీయ సంబంధాల్ని ఇడిసి
జబ్బునున్న కన్నోల్ల కన్నీళ్ల నిర్మూలనఆనకట్ట
కోసం నన్ను నేనుగా ఆర్పించుకుని
కాలితో బోరు పనికై కదం తొక్కిన
నా లాంటి జీవులు కొల్లలు కోకొల్లలు.
ఈ దేశాన....వీలాందరికి
నిజంగా ఈ దేశం శానా బాకీ...

బోర్లు వేయనికీ
పగలు, రాత్రి, రెండు సమమే
ఎండ,వాన,చలి,మరేదైనా మేము సిద్ధమే.
వంద,రెండొందలు,మూడొందల.....
వేయ్యి ఫీట్లకై మా ఫీట్ లు కందేల
రాడ్లను నాగళ్ళ మాదిరి మోసిమోసి
కందిన గాయాలకు, దిగమింగుకుని
దుఃఖపు అరుపులు బోరు యంత్రం
కుతలో కలిసిపోయేవి
దుబ్బను ప్రాణవాయువులా పీల్చి, పీల్చి
ఊపిరితిత్తులకు, ప్రమాదమని తెలిసిన
ప్రాణ త్యాగానికి దడవని బీదలం..
ఆకలి తల్లికి దత్త పుత్రులం .
ఐనా.
నీళ్ళు పడ్డాయంటే మా సంబురం ఆకాశం..

పానానికి విలువ గుర్తించని
మా గుత్తాదార్లు కమిషన్లో
కొంత మింగి,అప్పుల వడ్డీకి కొంత
కొంత సాధారణ ఖర్సులకు పోతే
మిగిలిన కొంచెం ఇంటికి ఆసరా..
గిప్పుడూ
కాల వంకరగా నవ్వుతున్న రోజులు
వచ్చాయి..

చేతులు పడిపోయే
కాళ్ళు కదపలేక
ఊపిరాడని బతుకులకు
ఊపిరితిత్తులు చెడిపోయి
వాయునాలలు దెబ్బతిని
శ్వాసనాళాలు పూరుకుపోయి
లోపలి అవయవాలు మొత్తం ఆగిపోయే
స్థితిలో నన్ను మంచానికి పరిమితం చేసిన సందర్భంలో
ఈ దేశం నాకు శానా బాకీ..

ఎన్నో,ఎన్నెన్నో బోర్లు
వేల కుటుంబాలకు నీళ్లనిచ్చి
కడకు ఏడ్వనికి కన్నీరు కూడా రావడంలేని
నా స్థితి. మంచాన లేవలేక చావును సమీపిస్తున్న
కుటుంబానికి మరింత కుంగదేసే సందర్భాన
ఈ దేశం శానా బాకీ పడ్డది..
నాకు నా కుటుంబానికి...

జుట్టంతా మన్నుతో, బండ పొడితో
అద్దబడి ఉన్నప్పుడు అందరి కళ్ళకు
వింత దృశ్యాలకు ఆలవాలం మేము.
కాస్తంత పొగకే
మూతులకు,ముక్కులకు పరదాలు
మాస్కులు మస్తుగా, మెండుగా
దరించేటోల్లకు మా పరిస్థితి అర్థంకాదు కదా
కనీసం ఆలోచించరు..
బాధని పంచుకునే తీరిక మాకు లేదు
వినే ఓపిక వీళ్లకు ఉండదు
ఎంతైనా. ఒప్పంద పని మనిషులం కదా
దీనికి భాష కూడా అడ్డేకదా..
తెలియకుండానే వచ్చాము
తెలియకుండానే పోతాము
మా బతుకుల కష్టాల లోతు తవ్వి
ఆనందాల నీళ్ళు నింపే
ఆసరాతో ఆదుకునే బోర్లు ఇంకా రాలేదు...

అప్పటి వరకు
అజ్ఞాతంగా బోరుమనుషుల మృతులు సంఖ్య
అంతుచిక్కని లెక్కనే అవుతుంది...
వారి కుటుంబాలతో
లబ్ది పొందిన ప్రతి బోరుబావి ఋణపడి ఉన్నది
వీటన్నింటికీ మూలమైన ఈ దేశం
శానా బాకీ పడ్డది....

-నాగరాజు మద్దెల
6301993211.

## నాని

కలము
పులిలా గర్జిస్తుంది!
అవినీతి పరుల
గుండెల్లో!

-చాపలమహేందర్
9949864152

## నిశ్శబ్ద లయలు..

పుస్తక సమీక్షలు





**"జీవిత పయనం**
**విరిసీ విరియని వసంతం**
**రాలీ రాలని శిశిరం"** అని భావించే
కవయిత్రి శిరీష శ్రీ భాష్యంగారు అక్షరాలన్నీ సరిగమలుగా పేర్చి.. కూర్చి.. రాగరంజితంగా మార్చి.. "నిశ్శబ్ద లయలు" కవితా సంపుటికి జీవం పోశారు. కవయిత్రి శిరీష కళలన్నింటిలో మమేకమై తమ మనసులో ముద్రించుకున్న పదాలను.. అలవోకగా అక్షరాల్లోకి ఒంపి మనకు అందించడం అభినందనీ యం..

ప్రతి పదంలో నువ్వున్నావు.. ప్రతి పాటలో నువ్వున్నావు.. ప్రతీ భావం వెనకా నువ్వున్నావంటూ అక్షరాన్ని ఉన్నతంగా చిత్రిస్తూ అక్షర ప్రభావం కల్పిస్తూ "నిశ్శబ్ద లయలు" గ్రంథాన్ని తీర్చిదిద్దారు. నాకు అక్షర కుసుమాలే ముఖ్యం.. నాకు సమున్నత భావాలే ఇష్టం.. అందుకే నా అక్షరం.. సుకుమార సుందర సుమధుర మందహాసమంటూ అక్షరావేదనను ఆవిష్కరింప యత్నించారు.

కవయిత్రి శిరీష.. కవితా వస్తువులను ఎంపిక చేసుకోవడంలో వైవిధ్యాన్ని ప్రదర్శించారు. అభివ్యక్తిలో కొత్తదనానికి చోటు కల్పించారు. శిల్పం విషయంలో ఔచిత్యవంతమైన పద ప్రయోగం చేసి తమ చతురతను ప్రదర్శించడం ప్రశంసనీయం.

శిరీష కవిత్వంలో సంభాషనలతో సాగే కన్నీటి సుడులను చూడగలం.. చిరునవ్వుల పువ్వులనూ వీక్షించగలం.. అపురూపంగా ఉన్న సుతి మెత్తని హృదయ రాగాలను వినగలం.. నీ మనసుకు పూసిన అక్షర సుమాలున్నంత కాలం.. నీ కనులకు విరిసిన ఆనందపు వెలుగులున్నంత కాలం నా సావాసం నీతోనే నన్ను వినమ్ర శీలతనూ చూడగలం. గుప్పెడు మనసులో గూడుకట్టుకున్న ఆత్మీయతను కోల్పోయామంటావా? దేహమే తప్ప మనసుకు స్పందన కరువయిందంటావా! అంటూ దగ్గరైన కొద్దీ మన మధ్యలో దూరానికి చోటెందుకిస్తున్నాం? అంటూ ప్రశ్నించడాన్ని శిరీష కవిత్వంలో గమనిస్తాం..

నాకు కొంత మౌనం కావాలని అర్థిస్తూ 'నవ్వు పువ్వు' కవితను రాశారు. నా భావాలకు మౌనంతో భాష పలికించాలని ఉందని తెలిపిన తీరు బాగుంది.

నువ్వు అంటే.. కవితలో.. నువ్వే జీవితం నాకు.. మనం కలిసిన కాలమంతా.. వేగంగా పరుగులిడినా.. మనం దూరమైన కాలం నిమ్మళంగా సాగినా.. జీవనం మాత్రం నీ ధ్యాసలోనే అని ప్రకటించడం బాగుంది.

'నలుపు తెలుపు' కవిత ద్వారా.. జీవితంలో నలుపు తెలుపులే.. ఏ రంగులూ ఉండవు.. అది మన భ్రమ అంతేనని తేల్చి చెప్పారు.

అక్షరాన్ని చిరునవ్వుగా భావించే శిరీష.. అక్షరాల మల్లెలు రాలినప్పుడల్లా.. ఆనంద సాగరంలో తేలిపోతుంటానని వినమ్రంగా విన్నవించుకుని విజ్ఞతను చాటుకున్నారు. మది తరంగాల్లో నాట్యం చేస్తున్న ఒక్కో అక్షరాన్ని అందమైన ఆహార్యంతో అభినయింప జేస్తుంటానని ప్రకటించుకున్న కవయిత్రి అంబరాన్ని ఎగిసితాకిన సంతోషాన.. ఒక్కో అక్షరాన్ని గువ్వపిట్టలా ఎగరేస్తుంటానని "అక్షరం చిరునవ్వు' కవితలో అందంగా తమ ఆకాంక్షను.. అక్షరంతో పెనవేసుకున్న బంధాన్ని చక్కగా ఆవిష్కరించారు. 'నీ నవ్వు' కవితనూ చక్కని భావుకతతో తీర్చిదిద్దారు. జ్ఞాపకాలకు జ్ఞాపకాలై.. ప్రతీ ఉదయమూ నన్ను తాకుతూనే ఉంటాయని "జ్ఞాపకాల వాన" కవితకు జీవం పోశారు. వానజల్లు కురిసినప్పుడల్లా నువ్వే గుర్తొస్తావంటూ.. "చినుకుల సడి" కవితను రూపుదిద్దారు.

మదిలో మంత్రవీణలు మ్రోగిస్తూ విచిత్ర రాగాలు ఆలపించే "నా నవ్వు నీదేనా" అంటూ మరో కవితను రాశారు.

కవయిత్రి శిరీష కవిత్వంలో.. ఆమె యొక్క ఉత్తమ వ్యక్తిత్వం.. సున్నిత మనస్తత్వం.. సమున్నత వినయం ముప్పేట అల్లుకుపోయాయి.

శిల్పం విషయంలో చక్కని ప్రతిభను ప్రదర్శిస్తూ రాసిన ఇందలి కవితలు అందరినీ ఇట్టే ఆకట్టుకుం టాయి... ఆమె కవిత్వంలో చక్కని భావుకతతో పాటు.. అక్కడక్కడ తాత్వికతనూ గమనిస్తాం.. దారి తప్పివచ్చినా.. ఏదో ఒకరోజు గమ్యాన్ని చేరుకోవాల్సిందేనని తేల్చి చెప్పిన ఆమె.. ప్రతీ కవితనూ ఆలోచనాత్మకంగా.. ప్రతిభావంతంగా మలిచారు. ఈ గ్రంథంలో ఆమె పొందుపరిచిన కవితల్లో.. శిశిరానికి వీడ్కోలు పలికి.. చిగురించిన ఆశల వసంతాలను మోసుకొచ్చే ఉగాదులున్నాయి. షడ్రుచుల సమ్మేళనమే ఉగాది అని చెప్పే కవితలూ ఉన్నాయి. వీర జవానుల పట్ల గౌరవ భావం చాటుకునే పదబంధాలున్నాయి. నాన్న అక్షరం కాదు.. జీవితమని తేల్చి చెప్పే పంక్తులూ ఉన్నాయి. అమ్మ లేకుంటే మనసు ఇక దిగులుకే చిరునామా అని విషద పరిచే అక్షర సుమాలూ ఉన్నాయి.

కవయిత్రి శిరీష అక్షరాలన్నీ పోగేసి.. రంగులతో నూరిపోసి.. కవితా చిత్రాలను అందంగా గీశారు.

నిశ్శబ్దలయలతో ఋతురాగాలనే కాదు. ..ఉదయ, వర్ణ, సుమ, స్వర హృదయ రాగాలను అక్షరాల్లో నిక్షిప్తం చేయడంలో సఫలీకృతులైనారు. ప్రకృతి అందాలను సైతం అనురాగ చిగుళ్లుగా మలిచి గొప్ప అనుభూతులను పంచారు.

చీకటి వెలుగులను.. నలుపు తెలుపులను.. ప్రకృతి కుంచెలో ఒదిగిన వర్ణచిత్రాలను.. మనసు గులాబీలను మౌన రాగాలతో అల్లి.. నిశ్శబ్దలయలను అక్షర రవళులుగా మనకు అందించారు. మౌనం వెనుక దాగి ఉన్న గాయాలను.. అంతః సంఘర్షణలో ఉండే అనంతమైన విస్ఫోటనలను.. అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

గోరింటాకు పాదాలు నర్తించినట్టుగా నీలిరంగు కాన్వాస్‌పై అందమైన భావాలతో.. శిరీషాలను ఒలికించిన కవయిత్రి శిరీష.. 'నీకు నాకు మధ్య నిశ్శబ్దమే మిగిలిందనీ.. మరుజన్మకు మన కథను మనమే రాసుకుందామనీ'' ప్రకటించడం ప్రశంసనీయం. ఇంకా శిరీష కవిత్వంలో ఉదయ సంధ్య వెలుగుల్లోని స్పర్శను నిన్నటి ఆనవాళ్లకై పరుగులు తీసే జీవితాన్ని చూడగలం. మౌన ప్రేమజాడలను.. నిశ్శబ్దంగా నవ్వులు పంచే మువ్వలను.. సంగీత ఝురిలోని తొలి రాగాలను.. ముత్యంలా చమక్కుమనే కవితా కుసుమాలను.. ఆనందాల బాల్యపు స్మృతులను.. ఇలా ఎన్నో భావాలను మోసుకొచ్చిన ఇందలి కవితలు కవయిత్రి శిరీష కవితా పటిమను చాటేలా కొలువుదీరాయి. అందమైన ముఖచిత్రమే కాదు.. అద్భుత కవిత్వాన్ని అందించిన ఈ గ్రంథం అందరు చదువదగింది.

**ప్రతులకు:** శిరీష శ్రీభాష్యం
1-1-490/1/ఎఫ్/203
రచనా నిలయం
చైతన్యపురి, హన్మకొండ
వరంగల్ అర్బన్-506 004
సెల్: 9705845824

**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## నానీలు

ఉన్నారో
లేరో మరి
ఎన్నడూ కనని
గ్రహాంతర వాసులు.

గ్రహాంతర వాసం
తప్పని సరేనేమో
నేల విడిచి
సాము చేస్తే.

ఎగిరే సాసర్లు
ఎవరు చూసారో
గ్రహాంతర వాసులు
ఉన్నారంటారు.

జీవావరణం
ఇంకెక్కుడుందో.
చుట్టరికము
కలుపుకోను.

మేధావి వర్గం
పరిశోధిస్తుంది
మరో గ్రహపు
ఆనవాళ్ళకై.

వింత వింత
విచిత్ర జీవులు
గ్రహాంతర వాసులట
ఊహాగానం.

అభివృద్ధికి
దిక్సూచియే...
గ్రహాంతరాల దాకా
ప్రయాణాలంటే.

అక్కడ
ఏ ఆహారముంటుందో
పరాయి గ్రహాలలో
పండేదేంటో.

గ్రహాంతర వాసుల
లోకం
త్రిశంకు స్వర్గం
లాంటిదేనా ఏంటి.

ఎన్ని
కాంతి సంవత్సరాలు దాటాలో
గ్రహాంతర వాసుల
చేరాలంటే.

ఊహా శక్తిని
మెచ్చుకు తీరాలి
కనిపించని వింత లోకంలో
విహరిస్తూ.

ఎంత విజ్ఞాన
సంపన్నులో
భూమిని చేరిన
గ్రహాంతర వాసులు!



-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## అదిగో వచ్చేసింది టీకా...

ఓసీ అక్కసు కక్కిన
ఓ కరోనా రక్కసీ !
ఎక్కడే ? నీవెక్కడ?
ఓసీ కంటికి కనిపించక
కాటువేసే ఓ కాలసర్పమా !
ఎక్కడే ? నీవెక్కడ?
ఓసీ మనుషులను మ్రింగే
ఓ మాయదారి మహమ్మారి !
ఎక్కడే ? నీవెక్కడ?

నిన్న నీవు మా అనుకోని అతిథివి
కాదు మా పాలిట హంతకురాలివి
నిన్న నీవు నివురుగప్పిన నిప్పువు
కాదు,ముసుగు కప్పుకున్న మృత్యువు-

నిన్న నీవు వైద్యశాలకు శ్మశానానికి
మధ్యన వ్రేలాడిన భయంకరభూతానివి,
కాదు కుత్తుకలు త్రెంచిన కత్తులవంతెనవి-

నిన్న నీవు రహస్యంగా వచ్చావు
ఊహించని విపత్తును తెచ్చావు
ఉగ్రరూపం దాల్చి అగ్రరాజ్యాలను సైతం
ఉక్కిరిబిక్కిరి చేశావు ఊబిలో త్రోశావు

రాత్రిరాత్రికే రక్తసంబంధాలను రద్దుచేశావు
పెనవేసుకున్న అనుబంధాలనెన్నింటినో
విడదీసి వీధిలోకి, కాదు విధినోట్లోకి విసిరావు-

ఎన్నో పచ్చని కాపురాల్లో చిచ్చురేపావు
ఎందరి బ్రతుకుల్లో బలి దీసుకున్నావు
ఎందరి రెక్కలనో విరిచి ముక్కలుచేసి
ఎగరలేని పక్షులనుచేశావు గుండెల్ని చీల్చావు
రాబందులా రక్తాన్ని పీల్చావు పిప్పిపిప్పిచేశావు-
ఓసీ అక్కసు కక్కిన
ఓ కరోనా రక్కసీ ఎక్కడే ? నీవెక్కడ?
ఇకనైనా నీ విలయతాండవమాపి,
నీ ప్రళయ గర్జనలాపి, నీ కరాళనృత్యమాపి
మారిపో మారిపో కాంతిరేఖలా...
ఎగిరిపో ఎగిరిపో శాంతికపోతంలా...
సాగిపో సాగిపో మలయమారుతంలా
కలిసిపో కలిసిపో కారుచీకట్లో...
నిలిచిపో నిలిచిపో మృత్యువుముంగిట్లో...
ఎందుకో తెలుసా అదిగో వచ్చేసింది టీకా
నీ గుండెల్లో గునపమై...నీ ప్రక్కలో బల్లెమై
నీ కంటిలో కారమై....
నీ పాలిట మృత్యువై



-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## మైలురాళ్ళు

జీవితం నిరంతర ప్రయాణం
గమ్యంచేరే దారిలో
ఎన్నో మలుపుల కథలు

గెలిచిన ఆనందాలు
ఓడిన ఆరాటాలు
అడుగడుగునా తారసపడే
అనుభవాల మైలు రాళ్ళు..

నొప్పించిన సంగతులు
మెప్పించిన సంఘటనలు
కొన్ని మౌనాలు కొన్ని రాగాలు

కన్నీళ్ళను దోసిట పట్టుకుని
వెతను దాటి వెళ్ళేందుకు
కదిపిన పాదాలకు
గుచ్చుకున్న ముళ్లు...
కలల తీరం చేరే
దారేదైనా దొరక్కపోదా అని వెతికి
వేసారిన వేళ అందిన
పూలదొంతులు

ఒక్కో మలుపులో ఒక్కో భావం
మది తలుపు తెరిచి చూస్తే
జ్ఞాపకాల దొంతరలుగా
అంతరంగపు పేటికలో
రాసి దాచుకున్న ప్రతీ పాఠమూ
ఓ మలుపే.......!!



-అనూశ్రీ
9666688370

## నిత్యస్మరణీయులు

### బుద్ధుడు



-దోరవేటి
సెల్:9866251679

శోకమయమైన మానవ లోకమందు
దుఃఖమును దాటగలిగెడి త్రోవజూపి
బోధిసత్త్వుడవైతివి బుద్ధదేవ!
అమిత శాంతిస్వభావ! మహానుభావ!

కోరికలే ప్రశాంతతను కూల్చును, దుఃఖములందు ముంచు; నా
కోరికలే నిరంతరము క్రోధ మసూయ మదమ్ము మత్సరం
బారయ గల్గజేయుచును హ్లాదము దూరము జేసి చేసి, సం
సారము భారమై యడుగు సాగగనీయదటంచు దెల్పితే...!

కరుణకు మారుపేరువయి గౌరవమున్ గనుగొంటి వీవు, దు
స్తరమగు శాంతి సౌధములు చక్కగ నిల్పియు దేశదేశముల్
నిరతము నిన్ను గొల్వగను నిశ్చల జ్ఞాన నిధాన! బోధనల్
తరణము జేయు దుఃఖముల దప్పక నాచరణం బొనర్చినన్.

శుద్ధోధన సుతుడా! ఓ
సిద్ధార్థ! యశోధరకును, శ్రీగౌతమికిన్
యిద్దర ముద్దుల తనయా!
బుద్ధుడవని పేరుగన్న పుణ్యాత్మ! నమో!

# బాల్యదశను విరగబూసిన మొగ్గలు




కల్మషంలేని మనసుతో ఉంటూ మానవ జీవితంలో తిరిగిరాని ఒక దశనే బాల్య దశ. పిల్లలను దేవతలతో పోలుస్తారు. నేటి బాలలే రేపటి పౌరులు కదా! పిల్లలకు చక్కని వాతావరణం కల్పించి విద్యాభ్యాసం చేయించి సామాజిక బాధ్యత తెలిసేలా పెంచినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. చిన్నారులకు తొలి గురువులు తల్లిదండ్రులే కాబట్టి వారిని పిల్లలు స్ఫూర్తిగా తీసుకుంటారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులవల్ల కావచ్చు కన్నవారికి దూరమై అనాధలుగా మిగిలిపోవడం వల్ల కావచ్చు అలా కొందరు బాలలు వారి బాల్య దశ ను కోల్పోతుంటారు. ఏదిఏమైనా మనమందరం బాల్యదశ నుండి వచ్చిన వాళ్ళమే... మొదటి జ్ఞాపకాలు ఇప్పటికీ మనసులో చెదిరిపోకుండా ముద్ర వేసుకుంటాయి. అప్పుడప్పుడు కంటికి ఎదురుగా కనిపించే బాలలను చూస్తే ఆ చిన్ననాటి జ్ఞాపకాలు తట్టి లేపుతాయి. అదే బాల్యాన్ని ఒక ప్రక్రియలో అక్షరీకరించి చూస్తే ఆఅక్షరాల్లో చంటిపిల్లల కిలకిల ధ్వనులు చక్కిలిగింతలు పెడతాయి .అక్షరాల మేళవింపు మొగ్గలు ప్రక్రియలో చదివినప్పుడు ఆ గుబాళింపుల అనుభూతిని పొందడం జరిగింది.

**"పిల్లలు తమ నవ్వులను తెంపుకొచ్చి**
**ఇంటిల్లిపాదికి దుఃఖాన్ని దూరం చేస్తారు**
**చీకటిని తుంచి వెలుగును పంచే నేస్తాలు పిల్లలు"**( బోల యాదయ్య )

నవ్వులను తెంపుకుని రావడం అనేది గొప్ప భావన.కల్మషం లేని ఆ నవ్వుల ని చూస్తే కొండంత కష్టమైనా ఇట్లే మర్చిపోతాం కదా !

"తరగతి సరస్సులో తామరలై తిరగాడుతూ
స్వర్ణ కమలాలై ఖ్యాతినొందుతారు వారు
భావి తరాలకు తరగని నిధులు నేటి బాలలు"( ఉప్పరి తిరుమలేష్ )

తరగతిని సరస్సుతో పోల్చి విద్యార్థులను తామరల తో పోల్చడం ఎదిగిన తీరును స్వర్ణ కమలాలు అనడం కవియొక్క వినూత్న భావన.

**"పెద్దలకు అండదండగా ఉంటూనే**
**తియ్యని తీపి కలలను పంచుతారు**
**బాలలు వెలుగులు నింపే ఆశాజ్యోతులు"**(కపిలవాయి వెంకటేశ్వర్లు)

కల్లా కపటం ఎరుగని మనసులతో కమ్మనైన కబుర్లు చెప్తారు. తీయని తీపి కలలను పంచుతారు అంటూ బాలలను నిత్యాన్వేషక పరిశోధకులు అంటున్నారు కవి.

**"నిరంతరం చిరునవ్వులు చిందిస్తూనే**
**మనలోని అలసటను దూరం చేస్తారు**
**పసిడి వెలుగులు పంచే పసిడిదివ్వెలు"**( సత్య నీలిమ)

ముద్దు మాటలతో మురిపించే మేలిమి ముత్యాలు గా గగనపు సిరిమువ్వలు గా వర్ణించారు.

**"అక్షరాలు దిద్దాల్సిన అందమైన బాల్యం**
**వెట్టిచాకిరి నీడలో మసకబారుతుంది**
**బాల్యం వరమే ఎప్పటికీ శాపగ్రస్తం కాదు"**( సముద్రాల శ్రీదేవి )

అందమైన బాల్యాన్ని అనుభవించనీయకుండా కార్మికులు గా మారుస్తున్న వైనాన్ని బ్రతుకు రాత మార్చే నిర్మాతలు వారి జీవితం శాపగ్రస్తంగా మారి మట్టిపాలు అవుతుంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**"ప్రత్యేక విద్యా క్షేత్రాలు ఆర్టిఇ చట్టాలున్నా**
**బాల కార్మిక నిర్మూలన కు ఆమడ దూరం**
**రైలు బోగీ శుభ్రతలో బాల్యం బందీ"**( సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు )

బాలలను కర్మయోగులంటారు బంగారు తోటలో విహరించే పసిమొగ్గలు, పాపపుణ్య మెరుగనట్టి కంటిపాపలవుతూ నాగరికతకు ప్రతిబింబాలవుతారు. కానీ అక్షరాలు విడిచి ఇటుకలను మోస్తూ కార్మికులుగా మారుతున్నారు ఎన్ని చట్టాలు వచ్చినా బాలకార్మికుల నిర్మూలన కు దూరమే అంటూ బాలలపై వారి భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**"నీటి చుక్క ముత్యపు చిప్పలో పడినట్లు**
**బాలురు మంచి పెంపకంలో పెరగాలి**
**కల్మషం లేని వారు ఎప్పటికీ బాలలే"**(ఆర్.చెన్నయ్య )

బుడి బుడి నడకలతో చిలుకపలుకులు పలికే బాలలను రేపటి సమాజానికి నడకలు వర్ణించారు. వారి నవ్వులతో కఠిన హృదయాలను కూడా కరిగిస్తారు అంటారు అలాంటి కల్మషం లేని బాలలు మంచి పెంపకం పెరగాలని ప్రబోధాత్మకంగా రాశాడు కవి.

**"ఆటపాటలతో అలరిస్తూ ఉంటూనే**
**అందరికీ ఆత్మీయ నేస్తం గా ఉంటారు**
**బాల్యం అంటేనే బలమైన అనుబంధం"**( సృజామి)

పిల్లలు నాన్న చిటికెన వేలు పట్టుకుని నడుస్తూ నవ సమాజానికి బాటలు వేస్తుంటారు. పిల్లల అల్లరి సాగరమంత ఘోష బాల్యం మూడు తరాల బహుమానం అంటూ మనకు బాల్యంతో గల అనుబంధాన్ని వర్ణించారు.

**"పిల్లలు ప్రశ్నించడం నేర్చుకుంటేనే**
**అవగాహనతో చదువుల్లో రాణిస్తారు**
**పిల్లలు ప్రశ్నించే చురకత్తుల వర్షాలు"** (నందిగామ కిషోర్)

స్వేచ్ఛ పూరిత వాతావరణం కల్పించి మొగ్గల్లాంటి పిల్లలను ఎదగనిస్తేనే కదా వెన్నెల లాంటి చిరునవ్వులతో వికసిస్తారు. పిల్లలను దండించ కూడదని వారిని ప్రోత్సహించి స్వేచ్ఛను ఇస్తే వారి ప్రతిభ వెలుగులోకి వస్తుందని చక్కని మొగ్గలు రాశారు కవి .

**"జన్మనిచ్చిన వారి రుణం తీర్చుకోగా**
**భువిలో వెలసిన ప్రేమ మూర్తులు వాళ్ళు**
**పిల్లలు తల్లిదండ్రుల కనుపాపలు"**( బైరోజు రాజశేఖర్ )

పిల్లలు గగనతలాన ఎగిరే శాంతి కపోతాలు అంటూ వర్ణించడం కీర్తి కిరీటంలో పొదిగిన జాతి రత్నాలు అనడం అద్భుతంగా ఉంది .

**"పలకా బలపం పట్టే చేతులతోనే**
**పారా పలుగు పట్టిన కార్మికులు**
**జీవనం కోసం కూలీ బతుకులు"**( జక్కు కృష్ణమూర్తి గౌడ్ )

తల్లిదండ్రులు చేసిన తప్పులకు పిల్లలు బలిపశువులుగా మారుతున్నార ని బానిసలుగా మారి దిక్కుమొక్కు లేని అభాగ్యులు గా మిగిలి పోతున్నారని అక్షరాలకు దగ్గర చేసి వారిని తీర్చిదిద్దాలని ప్రబోధాత్మకం గా చెప్పాడు కవి.

**"నవ్వుల పరిమళాలను వెదజల్లుతూనే**
**పువ్వుల మాలలను అందంగా అల్లుతారు**
**సుగంధానికి ప్రతిరూపాలు పిల్లలు** (మానా ప్రగడ సాహితి)

కవయిత్రి మొగ్గలతో మాలలల్లి చిన్నారుల నవ్వులతో వికసింపజేసి ఆసాంతం ఆనందింప చేసారు.

**"చిన్నారులు మెత్తని మట్టి ముద్దలవుతూ**
**మలుచుకోవడంలో నే అమ్మానాన్నల ప్రతిభ**
**గురువులు చెక్కిన శిల్పాలు బాలలు** (యలమర్తి అనురాధ )

తల్లిదండ్రులు గురువులు కలిసి చెక్కిన శిల్పాలు పిల్లలు అంటూ బాల్యంలోనే పిల్లలను సరైన మార్గంలో పెట్టాలని చక్కని మొగ్గలు రాశారు కవయిత్రి.

**" బుడిబుడి నడకల బుడతలవుతూ**
**అమ్మానాన్నల ఆశల పల్లకీలు వాళ్ళు**
**సాక్షాత్తు దేవుడి ప్రతిరూపాలు బాలలు"** (బొమ్ము విమల)

చదువుల సారంతో సంస్కారపు పుప్పొడి వెదజల్లే రేపటి పౌరులు గా బాలలను సుందరంగా వర్ణించారు కవయిత్రి .

**"నవ్వులొలికే పాలనురగల పసి తనమే**
**పడిలేచే కడలి అలల్లా ఎగిసే తరంగాలు**
**బాల్యంలో వేసే ప్రతి అడుగు భవితకు వెలుగు"**( కమ్మరి శిరీష )

అంటూ బాలలను భవితవ్యానికి చక్కని వెలుగులు అంటూ మొగ్గలను తొడిగారు .

**"ఆస్తి అంతస్తుల కన్నా అమ్మ ప్రేమ కోసమే**
**ఆరాటపడే సూక్ష్మబుద్ధి పరులు చిన్నారులు**
**అమ్మ అనురాగమే చిన్నారులకు అమృతం"**( కె. రాధికా రాణి )

అమ్మానాన్నల అనురాగాన్ని అమృతం తో పోల్చి చక్కని మొగ్గలు అందించారు.

**"ఊరి మధ్యలో ఓ నందనవనమవుతూ**
**పాఠశాల బృందావనం లా పరిమళిస్తుంది**
**రకరకాల మొగ్గల తారలు బాలలు"** (సి.హెచ్. శ్యామల)

చక్కనైన బడిలో సీతాకోక చిలుకలు గా వర్ణించారు

**"స్నేహ సుగంధాలను ఒడిసిపట్టుకొని**
**ఆత్మీయ రాగాలాపనతో వర్షిస్తారు**
**బాలలు మైత్రివనం వసించే మైత్రేయులు"**(డాక్టర్ బాదేపల్లి వెంకటయ్యగౌడ్)

విజ్ఞాన విపంచికలుగా భావితరాల ను శాసించే శాసనకర్తలు గా మొగ్గలను కూర్చారు .

**"తెల్లటి కాగితమంటి తమ మనసుల్లో**
**గురువులు చెప్పిందే వేదం గా లిఖిస్తారు**
**నమ్మకపు వాకిట్లో రంగవల్లులు బాలలు"**( అయిత అనిత)

అల్లరి కుసుమ పరాగాలుగా స్వచ్ఛ ముత్యాలు గా అభివర్ణించారు

**"అష్టా చెమ్మ లు అచ్చన్న గూళ్ళతో విరబూసిన ఆటలు**
**ఆనందపు లోగిళ్ళతో గడిచిన మరుపురాని ఊటలు**
**బాల్యం తీపి కలల మహిద్భూత ఊహా ప్రపంచం"** (రవి చంచల) చిన్ననాటి అమ్మ చేతి గోరుముద్ద లను అల్లరి చేష్టలను అరమరికలు లేని ఆప్యాయతలను అక్షరీకరించారు .

**"మహాత్ముని ఆశయాలకు మానవాళ్ళవుతూ**
**నెహ్రూ ప్రేమానురాగాల ప్రేమానురాగాల పరిమళాలవుతారు**
**బాలలు భవితవ్యానికి వెలుగు దీపికలు"** (జి శాంతా రెడ్డి )

మహాత్ముల ఆశయాలకు చిన్నారులే కరదీపికలు గా చక్కని మొగ్గలు తొడిగారు.

**"పసిప్రాయంలోనే సంస్కారం గంధాన్ని అద్ది**
**భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి**
**బాలలే భావితరాలకు సంస్కార వారధులు"** (గాండ్ల వీరమణి )

అమ్మ ఒడిలో దిద్దిన అక్షరాలు బడిలో నేర్చిన జీవిత పాఠాలు చదువులమ్మ వెలిగించిన చిన్నారులుగా అభివర్ణించారు

**"తాయిలాలు చాచే చేతులవుతూ**
**తారంగాలు ఆడే తువ్వాయిలు**
**తాపరభేదమెరుగని ముద్దుల పాపలు"** (రమాదేవి బాల బోయిన)

స్వచ్ఛ మనస్కులుగా పసిడి నవ్వుల బాలలు గా వర్ణించారు.

**" పడుతూ కూడా లేచి నడవాలనే**
**పిల్లల ప్రయత్నం ఎంతో గొప్పది**
**పడినా సరే నడిచే వరకు ఆగరు బాలలు"** (అనుపటి హేమలత)

ఎపిజె అబ్దుల్ కలాం గారి ని స్ఫూర్తిగా చేసుకొని రాసిన మొగ్గలతో గొప్పగా అలరించారు .

**"సత్య హరిశ్చంద్రుని బాటలో నడుస్తూనే**
**ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకుతుంటారు**
**సత్యానికి నిదర్శనాలు బడి పిల్లలు"** (యం.డి. సనా ఆర్షిన్)

బాల కవయిత్రి గారు బాలల పిలుపుకు బందీ అయిన చాచా నెహ్రూను బాలలు బంధువుగా అలరించారు

**" భాషా భేదాలు కులమతాలంటూ లేకుండా**
**బాల్యం అతీతంగా బడిలోనే సాధ్యమైతది**
**కులమతాలెరుగని జీవితం బాల్యం"**(బర్మ శశాంక్)

పిల్లలను బడిలో చేర్పించి బాధ్యత తీరిపోయింది అని అనుకోవడం కాదు వింత పోకడలు పోకుండా అనుక్షణం పిల్లలను సరైన మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులదే అని హితబోధ చేస్తున్నారు కవి.

**"స్వచ్ఛమైన విరిసిన మరుమల్లె పువ్వులా**
**బాల్యం వసివాడని నవ్వులతో అలరిస్తుంది**
**పాలుగారే పసిపాపలే మనోల్లాస దీపికలు"** (పులి జమున)

పిల్లలు నిర్మలత్వానికి నిదర్శనాలుగా, మనోల్లాస దీపికలుగా, చక్కని మొగ్గలతో అలరించారు కవయిత్రి.

**"గలగలమని నవ్వాల్సిన చిన్నారులు**
**గల్లి గల్లిన చాకిరీలతో బతుకీడుస్తున్నారు**
**బాల్యం రుచి తెలియని దురదృష్టవంతులు బాలలు"** (సునీత బండారు) చిన్ని బాలలు అక్షరాలు దిద్దాల్సిన వయసులో పని పిల్లలుగా ,వీధి కార్మికులుగా మారిపోయి బరువు బాధ్యతలతో తమ బాల్యాన్ని కోల్పోయి బతుకీడుస్తున్నారని వాపోయారు.

**"చిట్టి బుర్రలో ఊహను ఓర్పుగా తెలుసుకుంటూనే**
**వాస్తవికత కలిసిన విషయాలు చెప్పాలి**
**ఆసక్తి కలిగించే కథ లే బాలలకిష్టం"** (ఎం.వి.ఉమాదేవి)

పిల్లలు చేసే తప్పులను సరిదిద్దుతూ వారి ఆలోచనకు రూపమిచ్చి ఆసక్తి కలిగించే కథలతో ఓపికగా అన్ని విషయాలు తెలియజేయాలని హితబోధ చేశారు.

**"బాలలు పువ్వుల్లా విరిసి పరిమళాలు వెదజల్లితేనే**
**చదువులమ్మ మురిసి అక్షరాలతో పలకరించేది**
**దేశ ప్రగతికి పట్టుగొమ్మలు బాలలు"** (కుయ్యూరు బాలసుబ్రమణ్యం)

పిల్లల అల్లరి ని కిలకిల రావాలతో పోల్చడం ,పాఠశాలలో అలరించే పుత్తడిబొమ్మ గా చెప్పడం ఆనంద వేదిక గా మార్చిన బడిలో నైపుణ్యాలు బాలలను వెలికితీస్తే కళామతల్లి అపురూప కానుకగా బాలలు తయారవుతారని చక్కని మొగ్గలతో పలకరించారు .

**"మిలమిల మెరిసే పసిడి లాంటి పసిమనసులవుతూ**
**గలగల అలుగులు పారే ఆహ్లాద జిలుగులవుతారు**
**పిల్లలు సిరికాంతి స్పర్శతో వికసించే మొగ్గలు"** (కొప్పోలు యాదయ్య) వీరు రాసిన మొగ్గలు విభిన్నతను సంతరించుకున్నాయి .

**"వెన్ను తట్టి ధైర్యం చెబితే చాలు**
**కష్టతరమైనా దూసుకొని పోతారు**
**పిల్లలు ఆకాశంలో తారాజువ్వలు"**( కే.సువర్ణాదేవి)

పిల్లలు తాము చేసే పనిలో పట్టువదలని విక్రమార్కులతో పోల్చి చెబుతూ ఏదైనా సాధిస్తారని నమ్మకంగా చెబుతున్నారు.

**"కుటుంబంలోని పేదరిక మూలాలే**
**బాల్యాన్ని మొగ్గలోనే చిదిమేస్తున్నారు**
**దిక్కులేని వారికి దేవుడే దిక్కు"**(జాదవ్ పుండలిక్ రావు పాటిల్)

పేదరికంలోని బాలల పై జాలి కురిపిస్తూ వారికి మంచి రోజులు ఎప్పుడు వస్తాయో అని ప్రశ్నిస్తున్నాడు కవి.

**"విరిసే పూలు కురిసే వాన తమకే అనుకునే పిల్లలు**
**ఆత్మీయత అనురాగానికి ఆకర్షితులవుతారు**
**గురువుల బోధనలను వినయంగా వింటారు"** (ఉరిమళ్ళ సునంద)

ఎవరో చేసిన తప్పులకు చెత్తకుప్పలో నో పార వేయబడి అనాధలుగా మారి వీది దీపాలై పెరుగుతున్నారని చిన్నారులను భావి భారత భాగ్య విధాత లుగా తీర్చిదిద్దాలని ఆవేదనతో ఆత్మీయ వచనాలు చెప్పారు .

**"కేరింతలతో నవ్వుల పూలు పూయిస్తూ**
**ఇల్లంతా వెలుగు రేఖలు పంచుతారు**
**ఇంటికి బాలలే అసలైన వెలుగు దీపాలు"**( నెల్లూరు వెంకటలక్ష్మి)

బాలలను భావిభారత పౌరులుగా కీర్తించారు.

"జాతి ప్రగతికి రథచక్రాలవుతూనే
తెలుగు తల్లికి ఆభరణాలవుతారు
చాచా నెహ్రూకి గులాబీలు బాలలు"( శైలజా శ్రీనివాస్ )

అజ్ఞానపు చీకటిలో చిరుదివ్వెలు బాలలు అంటూ తనదైన శైలితో అక్షరీకరించారు

**"తల్లిదండ్రులను నిరంతరం ప్రేమిస్తూనే**
**కన్నవారి ప్రేమకు పాత్రులవుతారు**
**బాలలు నడయాడే సిరిసంపదలు"** (అంబటి భానుప్రకాష్ )

బంధుత్వాలకు చిరునామాగా బాలలను వర్ణించారు.

**"పువ్వులా జీవిత సందేశాన్ని ఇస్తూనే**
**బాలలు సత్య మార్గాన్ని చూపుతారు**
**సత్య మార్గమే మానవాళికి మోక్షమార్గం"**( కే. కృష్ణవేణి)

బాలలు తెలివితేటలకు చిరునామాలుగా కీర్తించారు .

**"పిల్లలు తూనీగలై గంతులేస్తున్నప్పుడల్లా**
**ఇసుక తిన్నెలో గిజిగాడి లా గుళ్ళు కడుతుంటారు**
**అద్భుతాలు సృష్టించే బాల శాస్త్రవేత్తలు పిల్లలు"**( పోలెవెంకటయ్య )

అంటూ వసంత కాలపు వెన్నెల గా పిల్లలను అక్షరీకరించారు.

**"అమ్మచంకన ఒదిగిన నెలవంకలవుతూనే**
**నల్లపలకపై మెరిసే ఓంకారాలవుతారు**
**బాల్యానికి ఓంకారమే తొలిగురువు"** (ఏడెల్లిరాములు )

ఎంత చక్కని వర్ణన ఆకాశాన మెరిసే నక్షత్రాలు గా వర్ణించారు .

**"నిరంతరం పాలజున్ను వలె నవ్వుతూనే**
**అందమైన నవ్వుల్ని పంచుతారు**
**పాలలాంటి వెన్నముద్దలు బాలలు"** (పగిడిపల్లి సురేందర్ పూసల)

విజ్ఞాన సముపార్జనకు నిఘంటువు ముత్యాలుగా చక్కని మొగ్గలు విరబూయించాడు కవి.

**"మౌనంగా మూగబోయిన మా మనసులను**
**పిల్లల అల్లరే సంతోష మాలికలవుతాయి**
**పిల్లల నవ్వులు ఇంట్లో పూచిన హరివిల్లులు"** (దార్ల రాఘవేంద్రా చారి) ఎల్లవేళలా వెలిగే పున్నములు గా వారి పలుకులు హృదిలో మ్రోగే ఘంటానాధాలుగా చక్కని మొగ్గలు పూయించారు.

**"చిలుకపలుకులొలికే చిన్నారులు**
**దేశానికి చరితార్థులవుతారు**
**బాలలు ఎప్పటికీ దేశోద్ధారకులు"** (టి.అంబుజ)

అనురాగాల తుమ్మెదలు గా మనోల్లాస మల్లెలుగా అక్షరీకరించారు

మల్లెపూల లాంటి స్వచ్ఛత నిండిన మనసులతో
లిల్లీ పువ్వుల సుగుణాలను చిందించే చిరునవ్వులు
నేటి బాలలు భారతి మోమున వికసించే వెలుగులు
(డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి )

చాచా నెహ్రూ కు అసలైన వారసులుగా చెప్పారు.

**"చేసే పనికి వంకరగా అడ్డు చెప్పకుంటే**
**ఆగిపోక విజయాలవైపు దూసుకుపోతారు**
**స్వేచ్ఛా వినువీధిన అగ్ని క్షిపణులు పిల్లలు"**( బి. రాణి లీలావతి )

**"పిల్లలు వసివాడని పసిడి వెన్నెల బుగ్గలవుతూనే**
**చిగురించే లేలేత కొమ్మల మొగ్గలువుతుంటారు**
**పిల్లలు ఎప్పటికీ వికసించే వెన్నెల కిరణాలు"** (డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ )

పిల్లలను తడియారని గంధపుచెక్కలుగా వారి మాటలు ముత్యాలముంగిళ్ళుగా, గుణం మంచిదనపు మరుమల్లెసుమగంధంగా అందమైన చక్కని మొగ్గలను విరబూయించారు.

ఇలా 46 మంది కవులతో బాలలపై విభిన్నమైన వ్యక్తీకరణ తో ఒక ప్రక్రియలో కవిత్వీకరించడం బాల్యదశలోని మధురమైన భావాలను వారిదైన శైలిలో ఆవిష్కరించడం ఎంతో అభినందనీయం . మొగ్గలు ప్రక్రియను సృష్టించడమే కాక ఎంతో మంది కవులను ప్రోత్సహిస్తున్న డా॥భీంపల్లి శ్రీకాంత్‌కు అభినందనలు.

**ప్రతులకు:** డా॥భీంపల్లి శ్రీకాంత్
8-5-39, టీచర్స్ కాలనీ
మహబూబ్‌నగర్-509 001
సెల్: 9032844017



**-వాసరచెట్ల జయంతి**
9985525355

పుస్తక సమీక్షలు

# సమాజ ప్రతిబింబ కవిత్వం

ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే రాయలసీమ ప్రాంతాన్ని కరువు సీమ గా అభివర్ణిస్తారు. అందులో అనంతపురం అంటే కరువుకు పెట్టింది పేరు అని పెద్దలు చెబుతుంటారు. ఇది వాస్తవమే ప్రస్తుతం మన కళ్ళ ముందు జరిగే పరిణామాలను మనం కూడా చూస్తున్నాం. కరువు సీమలో పుట్టిన ప్రతి పేద రైతు బక్క చిక్కి గుండెలవిసేలా రోదించిన ఘటనలు ఎన్నో, ఏడ్చి ఏడ్చి కన్నీరు ప్రవాహమై ఎండిపోయి దేహం ఎడారిలా మారిన సంఘటనలు కోకొల్లలు.

కరువు సీమలో రైతు రోదనలు మన ముందుకు తీసుకుని వచ్చిన గొప్ప వ్యక్తి యాములపల్లి నరసిరెడ్డి . సామాజిక స్పృహతో సమాజంలోని ప్రతి కోణాన్ని నిశితంగా పరిశీలించి సమస్యలన్నిం టినీ తన గొంతుకతో మన ముందుంచిన నరసి రెడ్డికి హృదయపూర్వక అభినందనలు.




రైతు గుండెలను తడిమి చూసి రైతన్న అనుభవాల్ని, నానాటికి నమసి పోతున్న కులవృత్తులను, పల్లెల జీవిత చిత్రాన్ని **"మన్నే మాతరం "** అనే పుస్తకంలో ఆవిష్కరించారు. కవి నిత్య నూతన విద్యార్థిలా అన్ని విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగిపోవాలి. రైతు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలకు పరిష్కారం అందించాలన్న ఉద్దేశం కవి మనస్సు లో ఉందని అర్థమవుతోంది .రైతు కుటుంబ నేపథ్యం వల్ల రైతు వేదనా భరిత సమస్యలను చూసి , అనుభవించి గుండెలోని భావాలు ఒక్కసారి గా ఉబికి వచ్చి ఈ "మన్నేమాతరం" అనే పుస్తకానికి నాంది పలికిందని చెప్పవచ్చు.

రుతువులు మారినా రైతుల స్థితిగతులు మారని దీనగాథల్ని" మన్నే మాతరం" అనే కవితా ఖండికలో చక్కగా వివరించారు.

**"మన్నే మాతరమంటూ దుమ్ము నేల దున్నేందుకు**
**మోకాలి గాయానికి మన్ను రాసుకొని**
**మొవ్వ కుళ్ళు మొక్కలా ముదురుకుపోయిన**
**తువ్వాలు గుడ్డను తలకు చుట్టుకొని**
**ఉక్కు సంకల్పానికి దిక్కు నేనంటూ**
**ఒకవేళ పోతే పొలంలోనే తుప్పుపట్టి పోతానని**
**దీన గాథల్ని కాగితాలపై రాసే కవుల కొదిలి."**

ఎన్ని కరువులు రైతు మీద పడి ఒళ్ళు గుల్ల చేసినా భూమిని దున్నడంలో మాత్రం వెనకాడబోమని చివరికి పొలంలోనే తుప్పుపట్టి పోతానని చాలా చక్కని భావాలతో రైతు దీనగాథల్ని ఆవిష్కరింపజేశారు.

కరువు సీమలో వర్షరుతువు ఆరంభం నుంచి వర్షం పడే తీరును, రైతులను ఉసూరుమనిపించే విధానాన్ని "వాన ఒత్తుంది"అనే కవితలో వివరించారు.

**"ఏవ్వీ రుతుపవనాలు**
**ఎక్కడికి రైతు ప్రయాణం**
**ఎన్నాళ్ళీ బోణీల్లేని ,బేరాల్లేని యాపారం**
**తీరాలు దాటాయని కొందరు**
**గంటల్లో విస్తరిస్తాయని మరికొందరు**
**యాడ దాటాయి ,ఎక్కడ దాపెట్టుకోండాయి**
**ఆ.. అలికిడేది సినుకు సిటుక్కుమన్న సప్పుడేది**
**అదను దాటిపోయినా పొదును జాడేది ? ."**

ఇది సీమలో వర్షం పడే తీరు. రైతు ఆశను నిరాశ చేస్తూ వర్షం రైతుతో ఆడుకునే తీరును మన ముందుంచారు కవి.

"మరో నిట్టూర్పు" అనే కవితా ఖండికలో మూగ జీవాల అగచాట్లను మూగబోయిన స్వరంతో మన ముందుకు తీసుకొచ్చారు. గడ్డి కోసం రోజుకో వైపు వెళ్లే మూగజీవుల దీనగాథ..

**"దిక్కుకో దినం ప్రయాణం**
**ఎక్కడ దొరకని గడ్డి గాదెం**
**తీరీ....తీరని ఆకలి కడుపులతో నిన్నటి లాగే తిరుగుముఖం**
**అర్థాకలితో రోజు గెలిచినందుకు సంతోషించాలా?**
**కనీ కనబడగానే పొదుగులు గుద్దెందుకు**
**అస్థిపంజరాలను ఆస్తిగా పొంది గాట్లో పడున్న**
**దూడలు మోకాల్లా జొరబడతాయి."**

..మూగజీవుల ఆకలి ఆక్రందనను మన ముందు ఆవిష్కరించారు.

సామాజిక అంశాలపైన కవికి మంచి పట్టు ఉంది సమాజపు స్థితిగతుల్ని నిశితంగా పరిశీలించిన గొప్ప కవిగా చెప్పుకోవచ్చు."ఎటు పోతివి నేస్తమా" అంటూ స్నేహం విలువను పాఠకుని మనస్సులో ప్రవేశపెట్టే ఈ కవితలో కవికి స్నేహితుల మీద ఉన్న మమకారం ఆప్యాయత చెప్పించాడు.

**"ఒక వేడుక సగంలోనే ముగిసినట్టు**
**ఇంటి మూల స్తంభం నడిమధ్యకు విరిగినట్టు**
**ఎటుబోతివి నేస్తమా..... నను వీడి"**

అకాల మరణం పొందిన స్నేహితుని తలుచుకుంటూ తను అనుభవించే బాధను మిత్రుని కుటుంబ సభ్యులు పొందే ఆవేదనను ఈ కవితలో పాఠకుని వంటందించి ఆవిష్కరింపజేశారు.

దేశ రక్షకుడు అంటే కవికి ప్రాణం "భారత సైనికుడు" అనే కవితలో

"అతన్ని చూస్తే
మండువేసవి వెండివెన్నెలవుతుంది
చలి నులి వెచ్చని దుప్పటవుతుంది
భరతమాత ముద్దుబిడ్డ అతడు
సరిహద్దుల పొడిచిన తొలిపొద్దు అతడు/
పవిత్ర భారత సైనికుడు అతడు" అంటూ దేశ సేవ చేసే సైనికులకు పాదాభివందనం చేస్తాడు.

ఉపాధి కోసం ఇతర దేశాలకు వలస వెళ్లిన వారి గురించి "ప్రవాస కిరణం" అనే కవితలో గుర్తు చేసుకుం టాడు. తను ఒక కవిగా గొప్ప కవుల జీవితాలను పరిచయం చేస్తూ, వారి అడుగుజాడల్లో నడుస్తూ వారిని స్మరించుకుంటూ. "నిప్పురవ్వ జాషువా" అంటూ నవయుగ చక్రవర్తి జాషువాను తలచుకుంటారు.



"గుండె కోత" అనే కవితలో నేతగాళ్ళ. బతుకు చిత్రంను మన ముందుంచారు. కన్నీరు తెప్పించే నేతన్న గ్రహస్థితులను గుండెకోతలో ఆవిష్కరించారు.

**"ఊరికి పేరు తెచ్చిన పనే**
**ఊరు విడిచి పొమ్మంటుంటే**
**అమ్మ రొమ్ముపై**
**నెత్తుటి ధారలు స్తంభించి**
**గడ్డకట్టిన వైనం................ అంటూ"**

నేతన్నల మగ్గం బతుకులను పాఠకుల గుండెకుతగిలేలా ఆవిష్కరించారు.

ఇవే కాకుండా " హంద్రీనీవాసుజల స్రవంతి" అనే కవితలో సీమలోని నీటిపారుదల గురించి , " జజ్జనకర గజ్జలు" అనే కవితలో కళాకారుల అవస్థల గురించి, "హే.... అబ్దుల్ కలాం హే...కలాం" అనే కవితలో శాస్త్రవేత్తల ఉనికిని ఈ పుస్తకంలో చాటారు. నేడు మనల్ని పట్టి పీడిస్తున్న కల్తీ వస్తువులు, కల్తీ ఆహారం గురించి "కల్తీ రాజ్యం" అనే కవితలో పాఠకుల ముందు ఆవిష్కరింపజేశారు.

అనేక విషయాల గురించి స్పందిస్తూ కవితాసంపుటి పరిపూర్ణవంతంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఈ కవితా సంపుటిలోని అనేక కవితలు వివిధ పత్రికల్లో బహుమానాలు పొందినవి ప్రముఖ సాహితీ కారుల మన్ననలు పొందినవి. సాహిత్యం మీద అభిలాష ఉన్న ప్రతి పాఠకుడు కచ్చితంగా ఈ పుస్తకాన్ని చదవాల్సిన అవసరం ఉంది. ఈ పుస్తకాన్ని చదువుతున్నంతసేపు గ్రామీణ ప్రాంత జీవితంలో మమేకమై పోయినట్టుగా ఉంటుంది.

పుస్తకం పేరు: మన్నే మాతరం
రచయిత పేరు: యాములపల్లి నరసిరెడ్డి
పేజీలు: 152
వెల :వంద రూపాయలు
ప్రతులకు :9492819059

**-ఈడిగ నగేష్**
9494643470

## చైతన్యజ్వాల.... !

వంటింటికే
పరిమిత మైనవాళ్ళని
వాకిట్లో తచ్చాడే
బహిస్కృతమహిళల్ని
అక్కున చేర్చుకుని
అక్షర గంధంతో అజ్ఞానాన్ని
తొలిగించిన ఆదిగురువు.. !

పురుషాధిక్యపు
ముంజేతి నీళ్లు తాగే
తరుణుల తలరాతలు మార్చిన
నవయుగపు
చదువులతల్లి ఆమె.. !
నయవంచక సమాజములో...
తలవంచక సాగిన
అక్షరయజ్ఞంలో
జ్ఞాన హవిస్సులందించిన
నవక్రాంతి ఆమె.. !
మహిళాప్రగతికి
పునాదులేసిన
జీవనజ్యోతి ఆమె.. !

విద్యుత్తుతో కుందేళ్ళ
రాతలను మార్చివేసిన
అద్వితీయ విద్యావిష్కరణ కై
నిల్చిన దిక్సూచి ఆమె.. !

స్త్రీల జీవనగతి మార్చితీర్చిన
విదుషీమణి చైతన్యరూపస్వని !
సావిత్రీ బాయ్ పూలే !!
ఎప్పటికీ బడుగుమహిళల
యెదలో నిల్చిన "పూమాలే"... !!!



**- గన్నోజు శ్రీనివాసాచారి**
8555899493

## పలకరింపు

ఆ తొలి కేరు కేరు
పలకరింపు ప్రస్థానం.
తొలకరి చిలకరిస్తే
ప్రకృతి చిగురించినట్లు
మధురిమతో పలకరిస్తే
మానవత్వం వికసిస్తుంది.
ఒక్క ఆత్మీయ పలకరింపు
మనస్సును ఆనందడోలికల్లో
ఓలలాడిస్తుంది.
ఒక్క సాంత్వన పలుకు
ముత్తెపు చిప్పలో పడ్డ
స్వాతి చినుకవుతుంది.
ఒక్క ఓదార్పు
చింతలు దూరం చేసి
మమతల తీరం చేరుస్తుంది.
నేస్తాల పిలుపు
మరుగున పడిన జ్ఞాపకాలకు
వెలుగులద్దుతుంది.
నేడు ఆప్యాయతలు కరువు
పలకరింపులు అరువు
ఎవరికి పట్టని పెద్దలు
నట్టింట్లో పాతసామాన్లు!
నేడు నెట్టింట్లో మనుషులంతా
స్వయం బందీలు!
వారికి ఆత్మ కోర్టు సమన్లు!
అందుకుంటే కదా, మార్పు!



**-పి.బక్కారెడ్డి**
9705315250

## రూపాయితో ఓడిపోయాను

సూర్యుడు ఆకాశాన్ని చీల్చుకుంటు
మేఘాలని దాటుకుంటూ వస్తున్నాడు
జీవితంలో దారి పొడుగునా
వెలుగు లేదు వెన్నెల లేదు.

అనుకుంటే మూగబోయిన పెదవులపై
పసిడి నవ్వు పూయించగలను
అయినా ఇప్పుడు ఆ ఆశ లేదు
ఈ ఆగిపోయిన గుండెను
కావాలంటే డమరుకంలా
మళ్ళీమోగించగలను
కానీ ఇప్పుడు ఆ ఓపిక లేదు.

తులసిదళంతో తూగడానికి
ఇది ద్వాపరయుగం కాదు
కుట్రలు కుతంత్రాలతో నిండిన
కలియుగం
ఇక్కడ బంధాలు అనుబంధాలకన్న
ఆస్తులు అంతస్తులకే మొగ్గె మనుషులు
నిజాయితీగా బ్రతకడమంటే
చెల్లని నోటులా ఉండడం.

ఊసరవెల్లిలా రంగులు మార్చే
మనుషుల మధ్య అలిసిపోయాను
మనిషి మీద స్వారీ చేసే
రూపాయితో ఓడిపోయాను
అత్యాశకోరల్లో చిక్కుకున్న
మానవులతో జీవించలేను



**-ఆకాష్ మునిగాల**
8106390647

## ఆసరా అడుగులేవీ ?

భూమి దుఃఖిస్తోంది
రోడ్డుపై నిలబడ్డ
రైతును జూస్తూ
అక్కరకురాని చట్టాలను చూస్తూ
ఆకాశం సిగ్గుతో తలదించుకొంది.
ఆకలిని అధిగమించి
ఓపికను నీడను చేసి
న్యాయం అంటూ
నిలబడ్డ అడుగులకు
ఓదార్పు పలుకులు ఊరిస్తూ
ఊరవతలే ఉన్నాయి.
ఆశగా ఎదురుచూస్తున్న రైతు కళ్ళు
వాయిదాల పర్వాన్ని చూస్తూ
నిప్పు పిడికిళ్లై నినదిస్తున్నాయి
ఎంతకూ దిగిరాని
ధీరులను చూస్తూ
దేశం తీక్షణంగా గమనిస్తోంది.
అందరి రాతలు విధాత రాస్తే
రైతు రాతను ఎవరో రాయడం విడ్డూరం
రాజు అన్న వాడి నడ్డి విరచడం హేయం
అతడు కన్న కలల్ని కూల్చడం నీచాతి,నీచం
ఆసరా అడుగులు
మడుగులై ముంచడం
రైతుకు తీరని శాపం...!!



**-మహబూబ్ బాషా చిల్లెం**
9502000415

## మనసులో మాట

పట్టుదలను తలపాగగాచుట్టి
శ్రమ చక్రాలపై పరిగెత్తుతూకూడ
అక్షరాన్ని మూడో నేత్రం గా అద్దుకొని
ఉడుకు రక్తం చల్లబడే దాకా
జోడు గుర్రాలపై స్వారీ చేస్తా....

ఆరోగ్య సిరులు కురిపించే
ఓంకార పదాల డమరుకాలను
నాలుకలపై నాట్యమాడిస్తూ
మూలనపడ్డ ఆయుర్వేద
ఔషధ నిధులను తవ్వుకుంటూ
మళ్ళీ మళ్ళీ తాగిస్తా....

అక్షరాన్ని ఆయుధంగా మలుచుకున్న
నన్ను నేను చెక్కుకునేఉలిగామారి
రత్నాలై మెరుస్తున్ననవ యువతరం
పాశ్చాత్య మోజుగుళికలకు లొంగకుండా
సంస్కరణలు చెక్కే శిల్పి గా ఎదిగి
స్వదేశీ తీపి సంస్కృతి పచ్చ పైరును
యెదమడిలో నాటేస్తా......

మాతృదేవోభవ పితృదేవోభవ
వేద ఘోషపంచాక్షరి మంత్రంగా
గుండె గుడిలో మోగిస్తూ...
వృద్ధాశ్రమాల ను తరిమేస్తా...

మరో బాల్యం వారికి దక్కాలని
భరత జాతి చరిత్ర దేదీప్యమానమై
సృష్టి ఉన్నంత కాలం జాతి రత్నాలై
చల్లగా బతకాలనే ఆశే
శ్వాసగా తపిస్తున్న.!!



**-అరుణ కీర్తి పతాక**
9395147443

## మనసు గీసిన చిత్రం

కాలం వెంట
ఎంత పదిలంగా కదులుతున్నా...
మనసు విచలితమవుతున్న వేళ
చూపు కనబడదు-మాట వినబడదు-
పలకాల్సిన మాటలు నాలుక
లోపలి అంచుల్లో మడత పడుతుంటాయి;
రూపు కట్టాల్సిన చిత్రాల రూపు
దూదిపింజల్లా గాలిలో తేలిపోతుంది;
స్పర్శకు ఇప్పుడు ఏ కరుకుదనమూ..
గరుకుతనమూ ఆనదు-
ఆలోచనల తునకలు ఎక్కడో
అగ్ని సరస్సులో మునిగి తేలుతున్నట్టు-!
పారిన జ్ఞాపకాల కాలువలో
వదిలిన అనుభవాల కాగితపు పడవలు
అలా అలా కదులుతూ..కదిలిస్తూ..

తొంగిచూసిన పచ్చటి చిగుళ్లు
ఎదురొచ్చిన గాలి తెమ్మెర కౌగిలింతలో
ఎంతగా మురిసిపోతుంటాయి ..!

గుప్పిట్లో దాక్కున్న శబ్దాలు
ఎగరేసిన పావురాళ్లలా కదలాడుతుంటే..
ఆకాశం పందిరి కింద
నాటుకోవాల్సిన కొత్త మొలకలేవో
అలిగి చేనుగట్టున మారం చేస్తూ....
ఎంత వేడెక్కిన కాలమైనా
ఒక తడిలో తడిసిపోయినప్పుడే
ఉరకలేసిన ఊహల చిక్కుముడులు
విప్పుకున్నట్టు....
విసురుకున్న చింపిరి తలలో
కొత్త కాంతుల మెరుపులు దిద్దుకున్నట్టు...

చిగురింతలు మాగడ
తరగలా కుదురుకున్నట్టు...
మౌనం..మాట.. సంభాషణ-
ఒద్దున కూచున్న గుండెలో
మనసు గీసిన చిత్రం ఒకటి
ఆవిష్కరణకు సిద్ధంగా...!!



**-మోతుకూరి అశోక్ కుమార్**
9247380976

## వాగ్విలాసం

మనిషితో పాటే
పుట్టిన మాట
ఎంత మాయలాడో
అవసరం అనుకుంటె
మనిషిని కలుపుతుంది
లేదంటె
ఆ ఇంటి మీది
కాకిని కూడా వాలనివ్వడు!

రెండు కన్నులు వేరైనా
చూసే దృశ్యం ఒకటె
రెండు చెవులు వేరైనా
వినే శబ్దం ఒకటె
నోరు ఒకటే అయినా
మాటలు రెండు తీర్లు
నరం లేని నాలుక చేసే
నడుమంత్రపు నాటకాలెన్నో!

కొందరి మాటలు
మనస్సుకు హత్తుకుంటాయి
కొందరి మాటలు
మనస్సును నొప్పిస్తాయి
కొందరి మాటలు
మనస్సును స్పందిపచేస్తాయి.

కొందరి మాటలు
మనస్పర్థలు పెంచుతాయి
కొందరి మాటలు
మనస్సును కరిగింపజేస్తాయి
కొందరి మాటలు
మనస్సును ఆలోచింపజేస్తాయి
కొందరి మాటలు
మనస్సును అగాధంలోకి నెట్టేస్తాయి.
అందరితో కలిసి సాగించే
జీవనయానమే జీవితం!

మాట మనిషికి
దేవుడిచ్చిన వరం
దాన్ని నిలబెట్టుకోవడం
ఉత్తమ మానవ లక్షణం
మనుషుల్ని
కలిపేది
విడగొట్టేది
మాటనే
అంతా చిత్రం
భళారే విచిత్రం
నరం లేని
నాలుక చేసే నటనే
ఈ వాగ్విలాసం
మనస్సనే ప్రయోగశాలలో
మాట చేసే
మధురానుభూతి
విన్యాసమే
వాగ్విలాసం.



**- డా॥ కూర్మాచలం శంకరస్వామి**
9703268858



# గాంధీ సూక్తం



-హెచ్. ఆర్. చంద్రం
సెల్: 9493248053

సత్యాహింసలె నా మత
సౌధమ్మున కగు పునాది;
సత్యమె నా దేవు, డతని
జాడ తెలుపునది అహింస!

కంటికి క న్నను పద్ధతి
కాదు నాకు సమ్మతమ్ము;
అట్టులైన లోక మెల్ల
అంధకారమయము కాద!

తన తలపుల ప్రతిరూపమె
తనదౌ వ్యక్తిత్వ మౌను;
మనిషి తాను కోరు దారి
ననుసరించి పోవును గద!

కలదు నాకు క్రీస్తుపైన
గౌరవ భావమ్ము, కాని
క్రీస్తు మార్గమును తప్పిన
క్రైస్తవులను మెచ్చలేను!

ఏ రీతిగ ఈప్రపంచ
మీవు మార గోరెదవో,
ఆ రీతిగముందు నీవె
మారి చూపు టుత్తమమౌ!

అంతరంగ మర్మ మరయు
నట్టి దైవ సన్నిధిలో
చేతల గని కాదు, తీర్పు
చేతము గని చెప్పబడును!

నీ తలపులు, నీ మాటలు,
నీ చేతలు ఒక్కటైన,
అప్పుడు కద చెప్పలేని
ఆనందము నీకు గల్గు!

వట్టి మాట లెంతసేపు
వల్లించిన ఫలిత మేమి?
కార్యాచరణమ్ము వలన
కలుగు నెప్పుడైన ఫలము!

వాస్తవ స్థితిగతుల నెరిగి
ప్రజాసమస్యల దీర్చగ
ఆసక్తిని జూపనట్టి
దది యొక మత మన జెల్లదు!

తనకు తాను లోలోననె
కనుగొనవలె మనిషి శాంతి;
బాహ్య విషయములు శాంతిని
ప్రభావితము చేయరాదు!

విభేదించవచ్చు గాక
వివిధాంశములను మతములు;
సత్య మొకటె శాశ్వత మని
సమైక్యముగ పలుకు నవ్వి!

జరుగబోవు దాని గూర్చి
పరితపించబోను నేను;
జరుగుచున్న దాని కొరకె
జాగ్రత్తలు గైకొందును!

శక్తి ఉద్భవించును స్థిర
సంకల్పమునందు నుండి;
కాని, కాదు దేహాకృతి
దానికి జన్మస్థానము!

న్యాయస్థానముల నెల్ల
అధిగమించ గలుగునట్టి
న్యాయస్థానమ్ము గలదు,
అంతఃకరణమె అయ్యది!

బలహీనుం డెటులైనను
ప్రభవించు; నహింసాపరు
డైనయట్టి శక్తిశాలి
అలవోకగ ఊడిపడడు!

అద్భుత మగు సూర్యాస్తమ
యమ్ము, పూర్ణచంద్ర శోభ
సృష్టికర్త లీల లని ప్ర
హృష్టుడనై పరవశింతు!

మిత్రునితో నెరపు టరుదె
మైత్రి? బద్ధశత్రువుతో
మైత్రి గలుప నేర్పును స
న్మతము! లౌక్య మన్య మెల్ల!

సామాన్యుడ నగుదు నేను,
సహజము లగు పొరపాటులు;
వెనుకాడను తప్పు నొప్పు
కొనగ, దిద్దుకొనగ నెపుడు!

నిన్ను నీవు దర్శించగ
నిక్కమైన మార్గ మొకటి
కలదు-పరుల సేవలోనె
గడపుచుండ వలయు బ్రతుకు!

శత్రు వగును కోప మహిం
సకు నెపుడు; అహింస బట్టి
అమాంతముగ మ్రింగివేయు
ఆసుర రూపము గర్వము!

హింసకు రూపాంతర మస
హిష్ణుత అని చెప్పవచ్చు;
ప్రజాస్వామ్య ప్రగతి కడ్డు
పడునది అనుకొనవచ్చును!

హాస్య ధోరణిని ఎరుగని
యట్టి వాడ నగుదునేని,
ఏనాడో ఆత్మహత్య
నేను చేసుకొని యుందును!

ఆరోగ్యమె ఎన్నటికి మ
హాభాగ్య మనంగ దగును;
స్వర్ణమొ, రజతమొ శశ్వత్
సంపద అనుకొనగ రాదు!

సర్వావస్థల అహింస
సాధ్యపడకపోవు గాక,
అహింసయే లక్ష్యముగా
అడుగు వేయవలె ముందుకు!

సహచరులను చిన్నబుచ్చి
సంతృప్తిని పొందు టెట్లు?
ఇది విషమ సమస్య నాకు,
ఎన్నటికిని తీరకుండె!

మనుజులలో సుగుణములనె
కనుగొన యత్నింతు, నేను
దోష విరహితుడను గాను,
దోషము లితరుల వెంచను!

శాంతి ప్రబోధమ్ము నైన,
సమర నిరోధమ్ము నైన
బాల బాలికల తోడనె
ప్రారంభించగ వలయును!

వ్యక్తపరచలేడు పిరికి
పంద ప్రేమ నెన్నటికిని;
సాహసవంతులకె అది
సాధ్యపడెడు కార్య మ్మగు!

స్వార్థ రహిత సేవలోన
చాలడు పురుషుడు మహిళకు;
ప్రకృతి వరముగా మహిళకు
ప్రసాదించియుండె దాని!

పెదవుల పనిలేదు మనసు
పెట్టి చేయు ప్రార్థనలకు;
అన్యమనస్కముగ జేయు
నట్టి ప్రార్థనలు వ్యర్థము!

ఆనందముగా సేవల
నందించుట శుభకరమ్ము;
అట్టి సేవలకు సరికా
వెట్టి భోగ భాగ్యములును!

హింసను వ్యతిరేకించెద,
నెందుల కన, నొకచో నెదొ
మేలొనరించిన నది తా
త్కాలికమౌ, కీడు స్థిరము!

స్వాతంత్ర్యము చౌకబారు
వస్తువు కాబో దెన్నడు;
బ్రతుకున కది యగు నూపిరి,
బ్రతుకు ముఖ్య మందరికిని!

ఆకలితో అలమటించు
అన్నార్తులు గల రెందరొ!
వారికి ఆహారమె దై
వ స్వరూప మనవచ్చును!

కట్టి, కొట్టి, చిత్రహింస
పెట్టి, చంపగలరు గాని,
సాధ్యపడదు మనసున కాం
క్షలు పెట్టుట యెవ్వరికిని!

సత్యాహింసలు చిరములు,
చాలగ శోధించినాడ;
ఇప్పుడు నాకడ కొత్తగ
చెప్పుట కెద్దియును లేదు!

ఎందునైన విశ్వాసము
హేతుబద్ధ మగుట లెస్స!
నిలువ దంధ విశ్వాసము
నిశ్చలమై; వెసన్ దొలగు!

అనుమాన మదొకరిపైన
అంకురించెనేని, ఇంక
అతడు చేయు పను లెల్లను
అనుమానాస్పదము లౌను!

నే రాంగీకారమ్మును
నే దృఢముగ సమర్థింతు;
మనసు శుభ్రపరచుట కది
పనిచేయును చీపురు వలె!

అప్రధాన మగు పని యని
అనిపించును గాక! మొదలు
పెట్టిన పని విడువక, తుద
ముట్ట చేసి తీరవలయు!

తన సమర్థ తనివార్య
మ్మని తలచగ దగ, దోటమి
నెరుగడె బలవంతు డెపుడు?
పొరపడడా ధీమంతుడు?

ప్రపంచమున కనీ సవస
రాల కెట్టి కొరత లేదు;
పేరాసలు పెంచుకొన్న,
తీరు టెన్నడును జరుగదు!

సంయమమును, మర్యాదయు
శక్తికి తోడైన, నింక
ప్రబలమైన ఆ శక్తికి
పరాజయ మ్ముండబోదు!

ఉపయోగ మెదేని యున్న
నుండవచ్చు భయము వల్ల;
కాని, పిరికితనము వల్ల
కనరా దటువంటి దెదియు!

ప్రార్థన అనగా నేమిటి?
ప్రతి వ్యక్తియు తన కుండిన
అనర్హతల, బలహీనత
లను స్వయముగ ఒప్పుకొనుట!

సాధ్యపడదు విడదీయగ
సత్యాహింసల నెన్నడు!
వానిది కనగా అవినా
భావపు సంబంధము మరి!

ఎంత చేయుచుండినాము?
ఎంత చేయగలము మనము?
అది తెలిసిన ముఖ్య సమ
స్యయె తీరును ప్రపంచమున!

వ్యక్తిగతములైన అభి
ప్రాయము లుండుట సహజము;
హార్దిక సంగమమున కవి
అడ్డంకులు కానేలా?

విశ్వసించవలె దేవుని,
విశ్వసించవలె మనిషిని;
అట్లుండుట అత్యావ
శ్యక మహింస సాధింపగ!

తమ సమస్యలకు స్వయముగ
తగు నిర్ణయములు గైకొన
గలిగినట్టి వారికి మా
ర్గ దర్శకుల పని యుండదు!

జనజీవన సరళిలోన
స్పష్ట రీతి సతతము ఆ
జాతికి సంబంధించిన
సంస్కృతి కనవచ్చుచుండు!

బ్రతుకవలయు చావు రేపె
వచ్చునేమొ అని తలచుచు!
జ్ఞానార్జన చేయవలయు
కలకాలము బ్రతికెద నని!

కండ బలమె నాయక ల
క్షణ మయ్యె నొకానొకపుడు;
కాని, ప్రజాబలమె నాయ
కత్వ లక్షణమ్ము నేడు!

ప్రపంచమును సరిదిద్దెడు
పని యేలా? దాని కన్న
మనల మనము దిద్దుకొనుట
ఘన కార్య మ్మగును నేడు!

బలహీనున కవకాశము
కలుగ దొరుల క్షమియించగ;
అలరారును క్షమాగుణము
బలవంతున కొక తొడవై!

వీర సైనికుని కన్నను
ధీరుడు సామాన్య వ్యక్తి!
ఆయుధమ్ము పట్టకుండ
ఆహ్వానించును చావును!

సకారణ మ్మగు నెడల అ
సంతృప్తియు మెప్పు గనును;
అభివృద్ధికి భూమికయై
అది యెంతో సహకరించు!

సారము గమనింతుమేని,
సర్వ మతము లొక్క తీరె!
ఆచరణములో మాత్రము
గోచరించు విభేదాలు!

తనలోపల నుండిన అం
తర్వాణిని ప్రతి వ్యక్తియు
ఆలకించనౌ దలచిన!
అందరిలో నది యుండును!

ప్రజల అభిప్రాయములను
లక్ష్యపెట్టకుండ నెవడు
పరిపాలించునొ, వానిని
పరదేశీయుం డనవలె!

కోరినట్టు కట్టి విడుచు
గుడ్డ కా దహింస యనగ!
గుండెలోన సుస్థిరమై
ఉండవలయు నది సతతము!

త్యాగివోలె మరణించగ
ధైర్యము మన కుండవలయు;
కాని కీర్తి కొరకు నెవరు
ప్రాణము విడనాడ తగదు!

సద్విమర్శలకు నిలువని,
సద్వర్తనమును మెచ్చని
ఏ మత సిద్ధాంతమైన
నేమి? త్రోసిపుత్తు నేను!

పరిమాణము బట్టి కాదు
పని విలువను లెక్కించుట,
పనితనమును బట్టి దాని
ఘనతను గుర్తించవలయు!

ఏ మత సిద్ధాంతమైన
ఈ హేతుప్రపంచమందు
కఠిన పరీక్షలకు నిలిచి
కనవలె సర్వుల సమ్మతి!

మంచి కెప్పుడైన సహక
రించుట కర్తవ్య; మటులె
చెడు కెన్నడును సహాయము
చేయకునికి కర్తవ్యమె!

స్వావలంబి యగుచు మనిషి
బ్రతుకునటులె, అన్యోన్యా
శ్రయము గూడ తప్పనిసరి,
సంఘజీవి గానమనిషి!

పరుల మేలు కొరకు పాటు
పడుచుండిన వ్యక్తి తదను
గుణముగనే వారి చేత
కొనియాడబడుట జరుగును!

సతతము త్రికరణ శుద్ధిగ
సదాలోచనలు చేయుచు
మనగలిగినచో నెల్లెడ
మంచి జరుగు తప్పకుండ!

ఎందరు చెప్పిన అసత్య
మెన్నడు సత్యమ్ము కాదు!
సాక్ష్యము లేనంత మాత్ర
సత్య మసత్యమ్ము కాదు!

సత్యమునకు స్వయంప్రకా
శమ్ము సహజ సిద్ధమ్మగు;
అజ్ఞానావరణ మెడల
అది వెలుగులు విరజిమ్మును!

తథ్యమైన చావు గూర్చి
తలచి తలచి చావనేల?
అనివార్యమ్మైన దాని
కై చింతించంగ నేల?

చిరకాలముగా నుండిన
దురభ్యాసములను ఒక్క
సారిగ విడనాడు టనిన
సాధ్యము కాబో దెవరికి!

తప్పు జరిగినపుడు దాని
నొప్పుకొనుట ఉత్తమమ్ము;
దాని వలన పెరుగగలదు
తప్పక మన సామర్థ్యము!

హక్కులకును, బాధ్యతలకు
అంత మన్న దుండ దెపుడు;
ఆగిపోక నిరంతరము
సాగిపోవుచుండు నవ్వి!

నన్ను మెచ్చు వారి కన్న,
నన్ను విమర్శించునట్టి
వారి వలనె హెచ్చు లాభ
పడితి నేను జీవితమున!

అది యొక విధమగు రోగ
మ్మని నేరము నెంచవలయు;
తదనుగుణముగానె చికి
త్సయు చేయించంగ దగును!

అన్నియు లోకమ్మున తన
అభిరుచులకు అనుగుణముగ
నే యుండగవలె నను తల
పెవ్వరికిని నుండ దగదు!

దైవమ్మును కించపరచ
దగదు జంతు బలుల నిచ్చి;
స్వచ్ఛాత్మార్పణము తప్ప
భగవంతుడు కోర డొండు!

ప్రతి విషయమునందు కాన
వచ్చుచుండు పరిణామము;
నిరంతరాయముగ జరుగు
పరిణామమె అగు చరిత్ర!

తప్పు నొప్పుకొనుచు, నింక
తప్పు నెపుడు చేయ ననుచు
నిర్మల బుద్ధిని చెప్పుట
నిజమగు ప్రాయశ్చిత్తము!

అంతరాత్మయే దైవ
మ్మని నమ్మిన వాడ గాన,
దానిని సంతృప్తి పరుప
నేను ప్రయత్నించుచుందు!

వెరవక, క్లిష్ట సమస్యల
పరిష్కార మరయు నట్టి
సాహసమ్ము గలుగువారె
సంఘోద్ధారకు లగుదురు!

స్వాతంత్ర్యము కొరకు జరుగు
సమరమ్ములు భారీ మూ
ల్యమ్ములు చెల్లించక సా
ధ్యమ్ములు కాలే దెన్నడు!

అదర్శము ముందిడుకొని
అది సాధించుట కొరకై
ప్రయత్నించుచుండిన, ఆ
వ్యక్తికి తిరుగుండ దింక!

ప్రతి విషయమునను నైతిక
వర్తనకే ప్రాధాన్యత!
భారత నాగరకత కదె
ప్రాణభూతమై నిలుచును!

బ్రతు కనగా ప్రయోగాల
పరంపరయె! అదియు గాక
చావుపైన నిరంతరము
సాగు సమరమున విజయము!

గురుతు పెట్టుకొన్న మాట
మరచు ప్రమాదమ్ము కలదు;
వ్రాసి పెట్టుకొన్న అక్ష
రమ్మది స్థిరమై నిలుచును!

దుష్ట భావనల పూర్తిగ
తొలగించుకొనుట సాధ్యమె?
తపస్సమాధిలో నిరం
తరము మునిగియున్న తప్పు!

ప్రతి మాటను ఆచి తూచి
మితభాషి వచించుచుండు;
అట్టివారి మాట లెపుడు
అర్థవంతములుగ నుండు!

సంస్కృతి యెదియైనను పర
సంస్కృతితో సంపర్కము
కలుగక యెడమై యుండిన
నిలిచియుండు టది కష్టము!

స్వచ్ఛ హృదయ క్షేత్రములనె
సచ్ఛీలము వేళ్ల నూను!
బలవంతముగా అసహా
యులపై నది రుద్ద తగదు!

భౌతిక సౌకర్యమ్ములు
ప్రబలుచుండు గాక యెన్నొ!
ఏమాత్రము నైతికాభి
వృద్ధి కవ్వి తోడుపడవు!

నాకు కలదు విశ్వాసము
లోకమ్మున గల ప్రసిద్ధ
మతము లెల్ల బోధించెడు
మౌలిక ధర్మముల పైన!

ఎల్ల విషయములకు శీల
మే మూలాధార మగును;
సత్యము ఆ శీలమందు
సారభూతమై ఒప్పును!

ఈ ప్రపంచమందు జూడ
నెల్లెడలను ఒకే తీరు;
సత్పురుషుల త్యాగములకె
సత్ఫలితము లందుచుండు!

తల పోయెడు వేళనైన
ధైర్య మూని నిలుచు టొప్పు!
తల కాచుకొనంగ జేయ
దగవు సిగ్గుచేటు పనులు!

ఒక విషయమునందు తాను
ప్రకటించియు విశ్వాసము,
ఆచరించడేని దాని
నాతడు నయవంచకుండు!

సేవాభావము, త్యాగము
స్త్రీ రూపమ్మును ధరించి
నిలిచె నని తలంతు నేను!
కొలుచుచుందు నా తీరునె!

సత్క్రమ మగు పెట్టుబడులు
సదా వాంఛనీయమ్ములె;
చెడు ఫలితము గలుగు,పెట్టు
బడి దుర్వినియోగ మైన!

సద్విద్యార్జన కావ
శ్యకము వ్యక్తిగత శీలము!

యుద్ధ రంగమందు ధర్మ
పద్ధతులకు తావుండదు!

హింస యొక్క వికృత రూప
మే సుమ్మా దారిద్ర్యము!

సజ్జనుండు లోకానికి
సన్మిత్రుండై చరించు!

నా సమ్మతి లేకుండగ
న న్నెవ్వడు నొప్పించడు!

అవగాహన కవరోధము
లగు క్రోధము, అసహిష్ణుత!

అంతరంగ భావాలను
హావభావములు తెలుపును!

సహనము కోల్పోవు నెడల
సమరము కోల్పోయి నటులె!

అచ్చమైన సౌందర్యము
స్వచ్ఛ హృదయ మందుండును!

సముపార్జించిన జ్ఞానము
సచ్ఛీలము గరప వలయు!

అన్య చింత లేని సేవ
అత్యుత్తమ సేవ యగును!

మరణమునకు సిద్ధపడిన
మనిషి స్వేచ్ఛగా బ్రతుకును!

న్యాయ సమ్మత మ్మగు వ్యా
జ్యము నడ్డదు సత్య మెపుడు!

ఆత్మ గౌరవమును మించి
నట్టిది వేరొకటి లేదు!

ఎచట ప్రేమ వెల్లివిరియు,
నచట బ్రతుకు పల్లవించు!

కొలది మంది పలుకు గాక,
వెలితి పడదు నిజ మెన్నడు!

నా జీవన విధానమే
నా సందేశము జగతికి!

పుస్తక సమీక్ష

# బాలల తాతా బాపూజీ






భారతదేశ స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ పాత్రధారి, సత్యం, అహింస మార్గాలను జీవితాంతం ఆచరించిన మహోన్నతుడు, భారతీయులందరికీ ఆదర్శప్రాయుడు, ప్రజల హృదయాలలో జాతిపితగా కొలువైన మహనీయుడు మహాత్మా గాంధీ. మన కాలంలో నడయాడిన బుద్ధుడిగా పేరొందిన గాంధీ మహాత్ముడి గురించి నేటితరం పిల్లలకు తెలియజేయాలనే సత్ సంకల్పంతో ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు, బాల సాహితీవేత్త, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో సహాయ సంపాదకులుగా పనిచేస్తున్న డా. పత్తిపాక మోహన్ బాలల తాతా బాపూజీ అనే పుస్తకాన్ని వెలువరించారు. గేయాల ద్వారా, కథల ద్వారా విషయాన్ని చెపితే పిల్లలకు సులభంగా అర్థమవుతుంది. అందుకే మన జాతిపిత గాంధీజీ గురించి గేయాలు మరియు గేయ కథ రూపంలో ఈ పుస్తకాన్ని రాశారు రచయిత. అనేక బాల సాహిత్య సంకలనాలు, బాల సాహిత్య అనువాదాలు వెలువరించిన పత్తిపాక మోహన్ కలం నుండి అద్భుతమైన రీతిలో వచ్చిన మరో ఆణిముత్యం బాలల తాతా బాపూజీ పుస్తకం. ఇందులో పది గేయాలతో పాటు ఒక గేయ కథ కూడా ఉంది

**మహాత్ముడు అనే గేయంలో .. భూమి మీద నడిచాడు/ మన కాలపు బుద్ధుడు/ ధర్మపథం మార్గమని/ నమ్మి ఆచరించినాడు.**

సత్యం, అహింస, ధర్మమార్గంలో నడిచిన బుద్ధుడిని మనము చూడలేదు కానీ ఆయన మార్గాన్ని అనుసరించిన గాంధీజీ మన కాలపు బుద్ధుడని అంటారు. గాంధీతో పాటు బుద్ధుడిని కూడ పిల్లలకు గుర్తుచేశారు రచయిత. జోతలు గేయంలో.. **భరతజాతి కంతటికి/ స్ఫూర్తి ప్రదాత జోతలివే/ అందుకొనుము గాంధీ తాత అని దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన గాంధీకి వందనాలు తెలియజేశారు. సత్యాగ్రహ ఆశ్రమాలు గేయంలో.. పోరుబాటలో నడిపించిన/ జన చైతన్య కేంద్రాలు/ మహాత్ముని ఆలోచన/ వర్ధిల్లిన మందిరాలు.** గాంధీజీ నడిపిన సత్యాగ్రహ ఆశ్రమాలు ప్రజల్లో చైతన్యం కలిగించి స్వాతంత్ర్య కాంక్షను రగిలించాయంటారు. మౌనిలో... మానవులను నడిపించగ/ మహిలోన వెలిసితివి. మానవులను సన్మార్గంలో నడిపించడానికి ఈ భూమిపై వెలిసిన మహాత్ముడు గాంధీ అని చెప్పారు. నీ మార్గం గేయంలో... **బాపూ నీ సందేశం/జాతికి అది ఆదర్శం/ ఆచరణం నీ మార్గం/ సదా మాకు ఆదేశం** అని గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు దేశప్రజలందరికి ఆదర్శమని, వాటిని అందరూ ఆచరిస్తే బాగుంటుందని ఆశిస్తారు రచయిత.

**రామ రాజ్యంలో ... పల్లెటూర్లు దేశానికి/ ప్రగతికి పట్టుకొమ్మలు/ పల్లెలు సమృద్ధిగుంటె/ అదే రామరాజ్యం. పల్లెలు దేశాభివృద్ధికి పట్టుకొమ్ములు** అని , పల్లెలు బాగున్నపుడే దేశం అన్ని రంగాలలో ముందుకు వెళ్తున్నదని గాంధీజీ ఆశయాన్ని సంక్షిప్తంగా పొందుపరిచారు. స్వాతంత్ర్య సారథిలో.. నిత్యం మనకు వెలుతురు పంచె సూర్యుడిలాగా స్వతతంత్రోద్యమంలో గాంధీజీ విరామం ఎరుగకుండా శ్రమించారు కాబట్టి గాంధీజీని అలుపెరుగని యోధుడవు/ అస్తమించని సూర్యుడివి అని పేర్కొంటూ గేయాన్ని రాశారు. బాలల తాతా బాపూజీ/ బంగారు నేత బాపూజీ.. అని పిల్లలకు ఇంపైన, సులభమైన రీతిలో లయాత్మకంగా పాడుకోవడానికి వీలుగా రాశారు బాలల తాతా గేయాన్ని. సూర్యుడు.. అనే గేయంలో సౌరాష్ట్రాన ఉదయించె/ స్వాతంత్ర్య సూర్యుడు. అహింసతో స్వాతంత్ర్యం/ సాధించిన వీరుడు. అహింస మార్గంలో స్వాతంత్రాన్ని సాధించిన గాంధీ సౌరాష్ట్రలో జన్మించాడని గుజరాత్ కు ఉన్న మరో పేరును పిల్లలకు తెలియజేశారు. **పంద్రా అగస్టు గేయంలో... రవి అస్తమించని రాజ్యపు/ సంకెళ్ళు తెంచిన రోజు/ స్వాతంత్ర్య కాంతులతో,** అని మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15 ప్రాధాన్యతను తెలిపారు. ఆరోజున మనము ఆంగ్లేయుల బానిసత్వపు సంకెళ్ళ నుండి విముక్తి పొంది స్వేచ్ఛా వాయువులను పీల్చామని, మన జీవితాలకు కొత్త వెలుగులు వచ్చాయని అంటారు.

గాంధీజీ పుట్టుక నుండి అతని జీవితంలోని ముఖ్య సంఘటనల ఆధారంగా ఒక గేయకథను కూడా పిల్లల కొరకు అందించారు రచయిత పత్తిపాక మోహన్. గాంధీ చిన్ననాటి ముద్దు పేరు మునియా అంటూ గాంధీజీ జీవితంలోని అనేక బాల్యపు సంఘటనలు గుర్తుచేశారు. ఇంగ్లాండ్ వెళ్లి బారిస్టర్ చదువుకొన్న సంఘటనను, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కులకై పోరాటం చేయడాన్ని కూడా ఈ గేయకథలో పొందుపరిచారు. స్వాతంత్రోద్యమ ముఖ్య ఘట్టాలైన చంపరాన్ సత్యాగ్రహం, రౌలత్ చట్టం, సహాయ నిరాకరణ ఉద్యమం, స్వదేశీ వస్తువుల వాడకం లాంటి అనేక అంశాలను పిల్లలు సులభంగా చదువుకునులా అలతి అలతి పదాలతో అందించారు పత్తిపాక మోహన్. దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషిచేసిన మహాత్ముడి గురించి భావి తరాలకు తెలియజేయాలని రచయిత తాపత్రయం ఇందులో కనబడింది.

పిల్లలకోసం కథలు, కవిత్వం, వ్యాసం వంటి విభిన్న ప్రక్రియలలో రచనలు చేసిన పత్తిపాక మోహన్ పిల్లలకోసం బాలల తాతా బాపూజీ పుస్తకంలో గేయాలతో పాటు గేయకథను కూడా పొందుపరిచారు. గత సంవత్సరం గాంధీ జయంతి కానుకగా నేటి నిజం దినపత్రికలో ఈ పుస్తకంలోని గేయాలు ప్రచురించి పాఠకులకు, ముఖ్యంగా పిల్లలకు మరింత చేరువ చేశారు పత్రిక సంపాదకులు బైస దేవదాస్ గారు. గేయాలకు అనుగుణంగా కూరెళ్ళ శ్రీనివాస్ వేసిన బొమ్మలు పుస్తకానికి అదనపు ఆకర్షణ తెచ్చాయి. అందమైన ముఖచిత్రంతో పాటు 64 పేజీలు గల బాలల తాతా బాపూజీ పుస్తకం వెల 75 రూపాయలు.

**ప్రతులకు...**
సెక్రటరీ, మానేరు రచయితల సంఘం,
5-4-47, పత్తిపాక స్ట్రీట్,
సిరిసిల్ల, 505301.



-కందుకూరి భాస్కర్
9703487088

# ఢిల్లీ పరిణామం తెలంగాణలోనూ పునరావృతం

## -టీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హెచ్చరిక

జగిత్యాల,జనవరి27(ఆర్ఎన్ఎ): ఢిల్లీ పరిణామం తెలంగాణలోనూ పునరావృతమవుతుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఆందోళన కలిగించే నిర్ణయాలు తీసుకుంటే వారు చూస్తూ ఊరుకోరని హెచ‌చరించారు. బుధవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, పీఎం మోదీ ఇద్దరూ దొంగలేనన్నారు. తెలంగాణలో మిల్లర్ల మీద ఉన్న ప్రేమ రైతుల మీద ఎందుకు లేదని ప్రశ్నించారు. మోదీతో కేసీఆర్ చీకటి ఒప్పందం చేసుకున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే రైతు చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు నిరసనలు కేవలం పంజాబ్ పరిసర ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా రైతు సంఘాలకు మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. ఆహార భద్రతకు చిల్లు పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. నూతన వ్యవసాయ చట్టాలను రాజ్యాంగ వ్యతిరేక చట్టాలుగా అభివర్ణించారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను మోదీ సర్కారు జైల్లో పెడుతుందని విమర్శించారు. రైతులకు మద్దతుగా నిలవకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సైతం నిరసన సెగలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. తొలుత వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించిన కేసీఆర్.. మూడు రోజుల్లోనే మాట మార్చారని, రైతుల పట్ల ముఖ్యమంత్రికి చిత్తశుద్ధే లేదని ఆరోపించారు. ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్ కేంద్ర పెద్దలకు వంగివంగి దండాలు పెట్టి వచ్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అప్రజాస్వామికంగా కుటుంబ పాలన సాగిస్తున్న కేసీఆర్.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. వ్యవసాయం అంటే కంపెనీలు కాదు, వ్యవసాయం అంటే రైతులు మాత్రమే.. అలాంటిది రైతు ప్రయోజనాలు పక్కన పెట్టి, కార్పొరేట్ శక్తులకు లబ్ది చేకూర్చాలని మోదీ సర్కారు భావిస్తే, దేశప్రజలంతా ఏకమై తగిన శాస్తి చెబుతారని హెచ్చరించారు. చట్టాలను సామాన్య ప్రజల లబ్ది కోసం రూపొందించాలి కానీ, కార్పొరేట్ శక్తుల కడుపు నింపడం కోసం కాదని ఆయన విమర్శించారు. సమాజంలో ఆత్మగౌరవంతో బతికేలా చూడాలని మాత్రమే రైతులు కోరుతున్నారని, అంతకు మించి వారు ఏదీ ఆశించడం లేదన్నారు. రైతు పోరాటం ఢిల్లీలోనే కాదు గల్లీలోనూ కొనసాగుతుందని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించాడు.

నేటి నిజాలు






త్యాగరాయ గానసభలో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 'బహుభాషా కవి సమ్మేళనం'లో పాల్గొన్న కవులతో అతిథులు బైస దేవదాసు, డా॥ జె. చెన్నయ్య, రవీంద్రనాథ్ సింగ్ చౌహాన్, డా॥కె.బి.గోపాలం, మర్రి శ్రీనివాస్, రఘుశ్రీ.

# సాగర్ కాలువలో కాంగ్రెస్ నేత గల్లంతు

ఖమ్మం,జనవరి27(ఆర్ఎన్ఎ): మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకాచౌదరి ప్రధాన అనుచరుడు నాగార్జున సాగర్ కాలువలో గల్లంతయ్యారు.. ఖమ్మం నగరంలోని సాగర్ కాలువలో ఈతకు వెళ్లి కాంగ్రెస్ నేత రవి.. గల్లంతైనట్టుగా చెబుతున్నారు. రేణుకా చౌదరికి ప్రధాన అనుచరుడిగా ఉన్న ఆయన.. పర్సనల్ అసిస్టెంట్ గా కూడా పనిచేస్తున్నాడు.. దాదాపుగా 11 కిలోమీటర్లు కూడా ఏకధాటిగా ఈత కొట్టడంలో రవి నిష్ణాతుడిగా చెబుతున్నారు.. అయితే, బుధవారం ఉదయం సాగర్ కాలువలోకి ఈతకు వెళ్లిన రవికి హార్ట్ స్ట్రోక్ రావడంతో గల్లంతై ఉంటాడని భావిస్తున్నారు.. మరోవైపు.. రవి కోసం సాగర్ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు, స్థానికులు.. గజ ఈతగాళ్లను కూడా రంగం లోకి దించినట్టు తెలుస్తోంది.



జనవరి 26న సాహితీకిరణం కార్యాలయంలో నిర్వహించబడిన జూమ్ మీటింగ్‌లో 'దుర్గాపురం రోడ్' అనే కవితాసంపుటికిగాను ఆచార్య నెల్లుట్ల స్మారక పురస్కారాన్ని దేశరాజుకు అందజేస్తున్న పొత్తూరి సుబ్బారావు, యం. బాలగంగాధరయ్య.

# కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారీ,లారీ ఢీకొని ఐదుగురు దుర్మరణం

తిరువనంతపురం,జనవరి27(ఆర్ఎన్ఎ): కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. కొల్లాం జిల్లా చిరక్కార ప్రాంతానికి చెందిన ఐదుగురు కారులో వెళ్తుండగా.. తొట్టక్కాడ్ వద్ద ఎదురుగా చేపల లోడుతో వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. కొల్లాంబలం సమీపంలో తొట్టక్కాడ్ వద్ద మంగళవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది.



